సంపుటి 49 సంచిక 128 జూన్ 2020

పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి



## యోగాతో ఆరోగ్యం

# విషయ సూచిక

**సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి**........................................................................1

సెక్రెటరీ రిపోర్ట్ – **వాణి మోటమఱ్ఱి** ........................................................................2



## శీర్షికలు

శ్రీమద్భగవద్గీత - పెయ్యేటి రంగారావు........................................................................4

ఇడ్లీ - అల్పాహార విందు! భలే రుచి!-విజయ గొల్లపూడి........................................................................8

సహనానికి సరిహద్దు - పెయ్యేటి రంగారావు........................................................................11

కరోనా గృహనిర్బంధం వివిధ కోణాలలో- విజయ గొల్లపూడి........................................................................18

సరసి కార్టూన్స్ - సరసి సరస్వతుల ........................................................................22

సున్నా లేద్దాం రా! - సరసి సరస్వతుల ........................................................................23

కొత్తబట్ట-యెల్లాప్రగడ రామకృష్ణారావు........................................................................26

ఈ మాసపు ప్రశ్నావళి ........................................................................28

కరోనా పాఠాలు - విజయ చావలి........................................................................31

సంగీతనాదామృతం - పద్మ మల్లెల ........................................................................36

అంతర్జాతీయ యోగా దినోత్సవం- మధు బైరెడ్డి........................................................................41

మా విశ్వనాధం మాస్టారు-విన్నకోట దుర్గ........................................................................43

పాట నేర్చుకుందామా / పాడుకుందామా ........................................................................46

కత్తి పోటు కలంపోటు-పెయ్యేటి శ్రీదేవి........................................................................48

బాలవాహిని ........................................................................52

అమెరిపబ్లికన్ ఏనుగూ – డెమొక్రాట్ గాడిదా- చిట్టెన్ రాజు వంగూరి........................................................................59

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | వెబ్ అడ్మిన్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | అపర్ణ సుసర్ల |

## సంపాదకీయం

తెలుగు వాహిని పాఠకులకు సవినయ నమస్సులతో జూన్ నెల సంచిక లోకి ఆహ్వానిస్తున్నాము. దాదాపుగా 2020 సంవత్సరం అర్ధభాగం పూర్తి కావస్తున్నది. ఈ నెలతో మన ఆస్ట్రేలియా లో ఉన్నవారికి ఆర్థిక సంవత్సరం కూడా ముగియవస్తున్నది. ప్రస్తుతం చాలావరకు కరోనా విపత్తునుంచిబయటపడుతున్నామనే అనుకోవచ్చు. మెల్లిగా రాకపోకలకు వెసులుబాటును ఇస్తూ సరిహద్దులను తెరిచే ప్రయత్నం చేస్తున్నారు పలు దేశ నేతలు.

జూన్ 21వతేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలి అని మన ప్రధాని మోడీగారు 2014 లో ఐకరాజ్యసమితిలో తీసుకువచ్చిన ప్రతిప్రాదనకు 193 దేశాలు వెనువెంటనే మద్దతు పలికాయి. ఈ సందర్భంలో వాహిని ముఖచిత్రం యోగా కి పిలుపునిస్తూ అందిస్తున్నాము. రక్తప్రసరణ, అన్ని అవయవాలు సక్రమరీతిలో పనిచేయడానికి, దీర్ఘకాలం జీవితం సాఫీగా సాగడానికి యోగా, సూర్యనమస్కారాలు, నడక, వ్యాయామం ఇవన్నీ తప్పక ఉపకరిస్తాయి.

తెలుగు అసోసియేషన్ ద్వారా రెండవ సాహితీసదస్సు సాంకేతిక పరిజ్ఞానంతో జూమ్ సెషన్ లో నిర్వహించనున్నాము. మీరందరూ తప్పక హాజర్ కాగలరని మనవి చేసుకుంటున్నాము.

ప్రతి క్షణం అప్రమత్తతతో, మానసిక చాంచల్యాన్ని విడనాడుతూ, మనోధైర్యంతో ముందుకు సాగాలి. వైజ్ఞానికంగా ఎన్నో సాధనాలు, విషయసంపద విస్తారంగా లభ్యమవుతున్నాయి. ఉన్న పనిముట్లను సకాలంలో వినియోగించుకుంటూ కార్యనిర్వహణలో నిమగ్నులమైతే జీవితంలో ప్రతి క్షణం ఆనందమయం. క్రొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస జీవితంలో ఉన్నతికి సోపానమవుతుంది. ప్రస్తుతం వాహిని పఠనానికి మీరు మీ విలువైన సమయం కేటాయించగలరని భావిస్తూ..

**మీ శ్రేయోభిలాషి**

**విజయ గొల్లపూడి**

**0438293687**


**vahini@sydneytelugu.org**

## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: సతీష్ వరదరాజు
0408 469 758


వైస్ ప్రెసిడెంట్: శ్రీ మధు బైరెడ్డి
0425 209 397


సెక్రెటరీ: వాణి మోటమఱ్ఱి
0418 184 111


ట్రెసరర్:మూర్తి ఓలేటి
0402 137 475



కమిటీ మెంబర్: వీర్రాజు గున్నం
0431 714 501


కమిటీ మెంబర్: మోహన్ కుమార్ పరస్సు 0419 219 526


కమిటీ మెంబర్: హరిబాబు కొల్లూరి
0425 291 032


## సబ్ కమిటీలు



వాణి కన్వీనర్ : సారధి మోటమఱ్ఱి
0430 002 130


వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు స్కూల్ కోఆర్డినేటర్
మల్లిక్ రాచకొండ 0431 680 092


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ పెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0400 031 546



సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## UIA మెంబర్


శ్రీని పిల్లమఱ్ఱి
0452 025 666

## ఫైనాన్సియల్ అడ్వైసరి కమిటీ (FAC)


మూర్తి పోతుకూచి


శ్రీనాధ్ ఖండవల్లి


సుందరం రాచకొండ


ఆడిటర్
మధు పెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear STA Members and friends,
With restricted movements and social visits, how are you surviving without much socialising? If you ask me, my weekends are getting busy with Zoom calls or Google Meets or Microsoft Team meetings. I am very happy that we are able to teach our parents and non-IT family members these online communication tools and bringing them onto the online chats so they are able to see us and chat. While we do not know when we can travel overseas, the online family meets are a huge comfort.
Our **Telugu Badi went online** replacing the face to face Sunday 10am – 12pm classes and we are very happy that there is ample interest. Thanks to our Badi Management Team and Volunteer teachers who have attended some training sessions, picked up the necessary skills and came back with double power & enthusiasm for online classes.
While we have cancelled or postponed many STA events due to the current COVID situation, I am happy to let you know that our Telugu Vahini team are bringing **the 2nd Telugu Sahithi Sadassu as an online Zoom session**. The event is planned for **20th June'20 from 3pm to 5pm**. If you want to contribute to the agenda and present in the session, do contact Smt. Vijaya Gollapudi on 0438 293 687.

As restrictions are being lifted, community becomes more active and gets back to business, it is important that we should follow the rules and stay safe whether we are working, visiting family and friends, or going out.
Always **Stay Safe** and

- Follow the rules about gatherings, self-isolation and quarantine
- Maintain a physical distance of at least 1.5 metres from others
- Practise good hand hygiene
- Stay active and healthy
- Take extra care if you're around vulnerable people
- Get tested if you have any symptoms, even if they are only mild
- Follow NSW Health advice about staying home while you are waiting for test results.

***Look after yourself and others**: Take care of your physical and mental health at these difficult times. Stay connected, keep moving and stick to a routine. Reach out if you need help.*

- During this difficult time, if any of you need help, please contact the STA Executive Committee via ec@sydneytelugu.org or by calling us direct on the mobiles – for details, please visit www.SydneyTelugu.org.

- I am pleased to let you know that Sri. Anantha Sai Parasa garu has joined STA as a Life Member. Let us welcome him on board.

Best Regards,

Vani Saradhi Motamarri
Secretary
Sydney Telugu Association

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

Please visit sydneytelugu.org and subscribe to Vahini monthly magazine to receive by e-mail.

❖❖❖❖❖

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

భాష్యం: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



**అథ ప్రథమోధ్యాయః = అర్జున విషాదయోగః (మొదటి అధ్యాయము - అర్జున విషాదయోగము)**

26.

తత్రాపశ్యత్ స్థితాన్ పార్థం పిత్యానథ పితామహాన్ |

ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా || 26 ||

శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి |

అథ = తరువాత

పార్థః = అర్జునుడు

తత్ర = అచట

ఉభయోః = ఇరుపక్షముల

సేనయోః, అపి = సేనలయందును

స్థితాన్ =నిలిచియున్న

పిత్యాన్ = పినతండ్రులను, పెదతండ్రులను (భూరిశ్రవస్సు మొదలగు వారు)

పితామహాన్ = తాతలను, (ముత్తాతలను) (భీష్ముడు మొదలగు వారు)

ఆచార్యాన్ = గురువులను (ద్రోణాచార్యుడు మొదలగు వారు)

మాతులాన్ = మేనమామలను (శల్యుడు మొదలగు వారు)

భ్రాతౄన్ = సోదరులను (దుర్యోధనుడు మొదలగు వారు)

పుత్రాన్ = పుత్రులను (దుర్యోధన పుత్రుడగు లక్ష్మణుడు మొదలగు వారు)

పౌత్రాన్ = మనుమలను (లక్ష్మణపుత్రుడు మొదలగు వారు)

తథా = అట్లే

సఖీన్ = మిత్రులను (ప్రత్యుపకారము నపేక్షింపక యుపకారమొనరించు వారు) (అశ్వత్థామ మొదలగు వారు)

శ్వశురాన్, చ = పిల్లనిచ్చిన మామలను (ద్రుపదుడు మొదలగు వారు)

సుహృదః, చ, ఏవ = మొదలగు ఆత్మీయులను అందరిని (కృతవర్మ మొదలగు వారు)

అపశ్యత్ = చూచి

తరువాత అర్జునుడు ఆ ఉభయసేనల యందును చేరియున్న పెదతండ్రులను, పినతండ్రులను, తాత ముత్తాతలను, గురువులను, మేనమామలను, సోదరులను, పుత్రులను, పౌత్రులను, మిత్రులను, పిల్లనిచ్చిన మామలను, మున్నగు ఆత్మీయులందరను చూచెను. ఉభయసేనలయందు అని చెప్పడం వలన, కౌరవసైన్యంలో వున్నవారిసే కాకుండా, తమ సైన్యంలో ఉన్నవారందరినీ కూడా అర్జునుడు పరికించి చూచాడు.

27.

తాన్ సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్ || 27 ||

కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ |

అవస్థితాన్, తాన్ = చేరియున్న వారైన

సర్వాన్, బంధూన్ = బంధువులందరిని

సమీక్ష్య = పరికించి

సః, కౌంతేయ = కుంతీపుత్రుడైన అర్జునుడు

పరయా, కృపయా అవిష్టః = మిక్కిలి కనికరముతో కూడినవాడై

విషీదన్ = శోకించుచు

ఇదమ్ = ఈ వచనమును

అబ్రవీత్ = పలికెను.

యుద్ధరంగములో నున్న బంధువులందరను చూచి, కుంతీపుత్రుడైన అర్జునుడు అత్యంత కరుణార్ద్ర హృదయుడై శోకించుచు ఇట్లు పలికెను. పొరుగు రాజ్యాలమీద యుద్ధం అంటే అది వేరు. కాని ఇక్కడ జరుగుతున్నది దాయాదుల మధ్య పోరు. అటు చూచినా, ఇటు చూచినా పరాయి వారెవరున్నారు? తాతగారైన భీష్ములవారు, గురువర్యులైన ద్రోణాచార్యులవారు, అన్నలు, తమ్ముళ్ళు, వారి కుమారులు, ఎటుచూచినా అంతా బంధువర్గమే. అందుకే అర్జునునికి దుఃఖం కలిగింది.

28, 29.

అర్జున ఉవాచ

దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుమ్ సముపస్థితమ్ || 28 ||

సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి |

వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే || 29 ||

కృష్ణ! = ఓ కృష్ణా!

సముపస్థితమ్ = (యుద్ధరంగమునకు) చేరియున్న

యుయుత్సుమ్ = యుద్ధాభిలాషతో నున్న

ఇమమ్ స్వజనమ్ = ఈ స్వజనమును

దృష్ట్వా = చూచి

మమ = నా యొక్క

గాత్రాణి = అవయవములు

సీదంతి = పట్టు తప్పుచున్నవి

చ = మరియు

ముఖమ్ = నోరు

పరిశుష్యతి = ఎండిపోవుచున్నది

చ = మరియు

మే = నా యొక్క

శరీరే = శరీరమునందు

వేపథుః = కంపము

రోమహర్షః = గగుర్పాటు కూడ

జాయతే = కలుగుచున్నది.

హే కృష్ణా! సమరోత్సాహముతో రణరంగమున నిలిచియున్న ఈ స్వజన సమూహమును చూచి నా అవయవములు పట్టు తప్పుచున్నవి. నోరు ఎండిపోవుచున్నది. శరీరమునందు వణుకు, గగుర్పాటు కలుగుచున్నవి.

అర్జునుడు స్వజనమ్ అన్నాడు. ఇక్కడే అతడు కలిగివున్న నేను, నా వారు అన్న మమకారం, బంధాలు తెలుస్తున్నాయి. జీవాత్మ ఎప్పుడైతే ఈ అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతూ వుంటాడో అతడు సంసారబంధనాల నుంచి తప్పించుకోలేడు. అందుకే శ్రీకృష్ణపరమాత్మ అతడికి ఉపనిషత్తులలో వున్న బ్రహ్మవిద్యను బోధించాడు. (ప్రతి అధ్యాయం చివర శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే అని చెప్పడంలో భగవద్గీత అంటే ఉపనిషత్తులలో వున్న బ్రహ్మవిద్య, యోగశాస్త్రం అని తేటతెల్లమవుతున్నది.)

30.

గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే |
న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః || 30 ||

హస్తాత్ = చేతినుండి

గాండీవమ్ = గాండీవము

స్రంసతే = జారిపోవుచున్నది

చ, త్వక్ ఏవ = మరియు చర్మము గూడ

పరిదహ్యతే = తాపమునొందుచున్నది

చ, మే = అట్లే నాయొక్క

మనః = మనస్సు

భ్రమతి, ఇవ = భ్రమకు లోనగుచున్నట్లున్నది

(అతః) = అందువలన

అవస్థాతుమ్, చ = నిశ్చలముగా నిలచియుండుటకును

న, శక్నోమి = సమర్థుడను కాకున్నాను.

గాండీవం చేతిలోంచి జారిపోతోంది. చర్మం తపించిపోతోంది. మనస్సు భ్రమకు గురియైనట్లు తోస్తోంది. కనక ఇక్కడ నిలబడలేక పోతున్నాను.
ఇక్కడ అర్జునునికి స్వదేహం మీద ఆత్మాభిమానం, పరదేహం మీద ఆత్మీయాభిమానం కలగడం వలన చిత్తం చలించింది. అతడు మమకారానికి లోనైనాడు. దాని వలన స్వధర్మం నిర్వర్తించలేక పోతున్నాడు. అతడికిపుడు ఆత్మజ్ఞానమే సరైన మందు.

ఒక్కసారి ఆలోచించండి; ఈ మమకారాలకి లోబడి నిజజీవితాలలో మనం కూడా స్వధర్మాలను ఎలా నిర్వర్తించలేక పోతున్నామో! 'ఏమండీ, ఈ ఉద్యోగానికి మా మేనల్లుడు కూడా దరఖాస్తు చేసాడండి. వాడికి ఈ ఉద్యోగం వచ్చేలా చెయ్యండి.' అంటూ బతిమాలుతాం. 'అదెలాగయ్యా? అవతల మీ మేనల్లుడి కన్నా ఎక్కువ అర్హతలున్న కుర్రవాడు ఉన్నాడయ్యా.' అన్నా వినం. 'ఎలాగైనా మా వాడికే ఈ ఉద్యోగం ఇప్పించండి.' అంటాం. అందుకోసం లంచం ఇవ్వడానికి కూడా సిద్ధపడడం ద్వారా అవినీతికి కూడా పాల్పడతాం. ఈ ఆత్మీయాభిమానం మనల్ని ఎంత దిగజారుస్తుందో గమనించండి. భగవద్గీతను కేవలం ఒక వేదాంతగ్రంథంగా భావించి పఠనం చెయ్యడం కాదు. అందులో చెప్పబడిన విషయాలను ఆకళింపు చేసుకుని, నిజజీవితాలకు వర్తింప జేసుకుని, మనల్ని మనం ఉద్ధరించుకోవాలి. భగవద్గీత మనకు మార్గదర్శకమైన గ్రంథం. ఇది అందరూ గమనించాల్సిన విషయం.

ఒక విద్యార్థికి స్వధర్మం చక్కగా చదువుకోవడం. ఒక గృహస్థుకు స్వధర్మం ఏకపత్నీవ్రతం, అతిథి అభ్యాగతులను ఆదరించడం, సన్మార్గంలో చరించడం. ఒక సన్యాసికి స్వధర్మం పరివ్రాజకం. ఇహబంధాలలో చిక్కు కోకుండా, ముముక్షువుగా జీవించడం. అంతేగాని రాజకీయాలలో తల దూర్చడం కాదు కదా? మనం మన స్వధర్మాలను నిర్వర్తించ లేకపోవడం ద్వారా మన జీవితాలను వ్యర్థం చేసుకుంటున్నామేమో ఆలోచించండి.

❖❖❖❖❖



# ఇడ్లీ - అల్పాహార విందు! భలే రుచి!

శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ



'East or West Idli is the best'. అవును ప్రొద్దున్నే ఆవిరిమీద ఉడికించిన వేడివేడి ఇడ్లీ రుచి అంటే తెలియని తెలుగువారు ఉండరనే అనుకుంటా.

మనం రోజు ఉదయం అల్పాహారంగా తినే ఇడ్లీలు ఎలా ఆవిర్భవించాయి?

మన తాతలు, ముత్తాతలు, బామ్మలు, అమ్మమ్మలు ఇడ్లీలు తిన్నారా? ఇడ్లీలు అసలు ఎలా వాడుకలోకి వచ్చాయి? ఎప్పటినుంచి మనం అల్పాహారంగా తింటున్నామో ఆలోచించారా?

ఇడ్లీ రాకముందు ఏమి తినేవారు? చద్ది అన్నం పెరుగు తిని పనిపాటలకు వెళ్ళేవారు. పెరుగన్నం ఉదయమే తింటే ఇంకేమన్నా ఉందా? హాయిగా నిద్ర ముంచుకు వచ్చేయదు. అదే వేడివేడిగా రెండు ఇడ్లీలు సాంబార్ తో లాగిస్తే - ఓహ్ ఆ రుచే వేరు. భలే బాగు బాగు. మధ్యాహ్నందాకా తెలియకుండా రోజు గడచిపోతుంది.

మనతో పోలిస్తే మన పూర్వులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఆరగించేవారు. మన ఇళ్ళలో ఇదే ఇడ్లీలని పెద్దవాళ్ళు ఇడ్డెనలు అని కూడా పిలిచేవారు.

మన తెలుగు సాహిత్యంలో శ్రీనాథ మహాకవి "అపూపంబులు, లడ్డుపంబులు, ఇడ్డెనలు, కుడుములు: అంటూ కాశీఖండములో

ఇచ్చిన ఆహారపదార్థాల పట్టీలో ఇడ్డెనలు, కుడుములు, మోదకములు ఇలా ప్రస్తావించబడ్డాయి. ఇవన్నీ ఒకటి కాదు. ఇడ్డెన అంటే ఆవిరి కుడుము కానే కాదు. కానీ ఇడ్డెనలు అంటే ఇడ్లీలే.

కంచి దేవరాజు స్వామి ఆలయంలో ఇప్పటికీ కిలోన్నర బరువుతో ఇడ్లీ తయారుచేసి స్వామికి నైవేద్యం పెడతారు

మినపప్పు ఆరు గంటలవరకు నానబెట్టి, రుబ్బరోలు లో కష్టపడి రుబ్బేవారు కొన్ని ఏళ్ళ క్రితం వరకు మన ఇళ్ళలో.

ఇప్పుడు వాటి స్థానంలో మిక్సీలు, గ్రైండర్లు వచ్చేసి, గృహిణి కి ఇడ్లీ పిండి రుబ్బుకోవటం సులభతరం చేసాయి.
ఇడ్లీ తయారీకోసమై ప్రత్యేకమైన ఇడ్లీ పాత్రలు అవసరం. ప్రత్యేకించి ఆవిరి మీద ఇడ్లీ ఉడకడానికి ఇడ్లీ పళ్ళేల స్టాండ్ వాడతారు.
మైక్రోవేవ్ లో ఇడ్లీలు మూడు నిమిషాలలో తయారుచేసుకోవడానికి వీలుగా పాత్రలు లభ్యమవుతున్నాయి ఇపుడు.
ఇడ్లీ పిండికి ఉప్పుడు రవ్వ చేరిస్తే, మరుసటి రోజుకు పులిసి ఇడ్లీ రుచికరంగా ఉంటుంది. అందువలన పులిసిన పిండికి పాలు విరుద్ధం. ఇడ్లీ/సాంబార్ తిన్నవెంటనే  కాఫీ/ టీ తాగకుండా ఉంటే మంచిది.
ఇడ్లీ కొబ్బరి పచ్చడి, సాంబార్ తో తీసుకునే అలవాటు తమిళ సోదరులవద్దనుంచే మనం పుణికిపుచ్చుకున్నామేమో.
ఇడ్లీకి దట్టంగా కారప్పొడి, అల్లం మరియు కొబ్బరి పచ్చడితో కరిగించిన నెయ్యి/ వెన్న వేసి, రుచికరంగా ఇడ్లీ లను అల్పాహారంగా అరటి ఆకులో అందివ్వటంలో విజయవాడలోని బాబాయ్ హోటల్ ఎంతగానో పేరొందింది.

బెజవాడలో గాంధీనగర్ లో ఉన్న సుప్రసిద్ధమైన శాకాహార రెస్టారెంటు 'బాబాయ్ హోటల్ దశాబ్దాలు గడిచినా అవే రుచులతో నేటికీ సందర్శకులను నోరూరించడం విశేషం.  1942 లో ఈ హోటల్ ని **కీ. శే. పాత్రుని సాంబమూర్తి గారు** స్థాపించారు.

ఆంధ్రుల అభిమాన సినీ నటులు ఎన్టీఆర్, ఏయన్నార్, సావిత్రి మొదలైన వారెందరో మాత్రమే కాక వి. శాంతారాం, సత్యజిత్ రే వంటి ఉత్తరాది సినీ ప్రముఖులు కూడా ఈ హోటల్ సందర్శించి, ఇక్కడ కూర్చుని పిచ్చాపాటీ కబుర్లు  చెప్పుకుంటూ,  వేడి, వేడి తాజా టిఫిన్లు తిన్నవారేనని తెలుసుకుంటే ఎవరికైనా దీని ప్రశస్తి ఇట్టే అర్థమైపోతుంది. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి గారి వంటి ప్రముఖ నేతలంతా బాబాయ్ హోటల్ ఇడ్లీ అంటే తెగ మనసు పడేవారంటే అది సామాన్యమైన విషయం మాత్రం కాదని మనం గ్రహించవచ్చు. ఇక్కడి ఇడ్లీ ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే దాదాపు అన్ని ఫైవ్ స్టార్  హోటళ్ళ మెనూలలో 'బాబాయ్ హోటల్ ఇడ్లీ' అనే అంశం తప్పనిసరిగా ఉంటుంది. స్వచ్ఛమైన ఆవునేతిలో ముంచెత్తిన మెత్తటి ఇడ్లీలు ఇక్కడి ప్రత్యేకత. బాగా మెత్తగా దూదుల్లా ఉడికిన ఇడ్లీలపై స్వచ్ఛమైన వెన్నరాసి,  కమ్మని కారప్పొడి, నెయ్యి, రెండు మూడు రకాల చట్నీలతో  వడ్డిస్తారిక్కడ.

ముందుగా నూనె ప్రధానమైన అల్పాహారం తీసుకోబోయేముందు, ఇడ్లీతో ప్రారంభిస్తే ఆరోగ్యకరంగా ఉంటుంది అని భావించే వాళ్ళు ఉన్నారు. సాదా ఇడ్లీ కి రూపాంతరంగా, అప్పటికప్పుడు రవ్వ ఇడ్లీ తో సరిపెట్టేసుకునేవారున్నా, కష్టపడి పిండి రుబ్బి చేసుకున్న ఇడ్లీ ల సాటి మరేది రాదు. పెద్దలే కాదు, పిల్లలు కూడా ఇష్టపడతారు ఇడ్లీలు అనగానే.

❖❖❖❖❖

# TELUGU ASSOCIATION INC.,SYDNEY Estd.,1992

WWW. SYDNEYTELUGU.ORG /SYDNEYTELUGU

"Stay healthy, Stay safe Campaign."

# COVID19

# Support for International Students & Needy

Wear a mask if you have a cough or runny nose

See a doctor if you feel unwell

Wash hands frequently with soap

Cover your mouth with a tissue paper when coughing or sneezing

## FOR HEALTH SUPPORT ASSISTANCE

CONTACT
MOHAN KUMAR PARASU
0419 219 526

## VISA AND IMMIGRATION SERVICES

CONTACT
MADHU BYREDDY
0425 209 397

1.5 METRE
MAINTAIN SOCIAL DISTANCING

LET'S ALL DO OUR PART

## ACCOUNTING AND TAXATION SERVICES

CONTACT
HARI KOLLURI
0425 291 032

## FOOD AND GROCERY ASSISTANCE

CONTACT
MURTHY VOLETI
0402 137 475

## THANKS TO OUR SUPPORTING ORGANISATIONS


RAILWAY ROAD MEDICAL CENTRE – QUALITY COMMUNITY CARE
CENTRAL EQUITY 30th – AWARD WINNING MELBOURNE DEVELOPER – OVER 70 PROJECTS DELIVERED AS PROMISED
Apex Dental Centre – Gentle, Caring, Quality Dentistry
WESTMEAD DOCTORS
VINS Taxation Services
TaxNET
Venkat Kantpudi, B.Com, MPA, FIPA, FTIA – Mortgage Broker & Tax Agent – Mobile: 0421374365
SMG Stone – SMG Stone pty ltd.
Mirch Masala – Indian Cuisine
Dosa Hut – Indian Multi Cuisine
ARA VAULTS
Family Care GP
SIRI SAMPADA – Trust . Innovation . Tradition
Paradise
SoftLabs – Demands Delivered
Rainbow Dental Practice @ sydney olympic park – Dr. Shalini Sunkara – Call: 02 8021 5285
INDAUS IMMIGRATION – Home to all your migration needs...
Swagath – Biryani House
Sweet UTSAV
RAY Finance Group


DESIGNED BY DSLRCREW- 0403226300

AVAIL THIS FREE SUPPORT DURING THE PANDAMIC PERIOD

President: SATEESH BV RAJU Mobile: 0408469758 Email: ec@sydneytelugu.org

For Further Details Contact: Vani Motamarri 0418184111 || Raj Gunnam 0431712501

# సహనానికి సరిహద్దు

శ్రీ పెయ్యేటి రంగారావు,హైద్రాబాద్

అది బెంగళూరు మహానగరంలోని సాయి టెక్ సొల్యూషన్స్ వారి కార్యాలయం. ఉదయం సుమారు పదిగంటల నలభై ఐదు నిముషాలైంది. ఉద్యోగులందరూ అప్పటికే తమ తమ కుర్చీల్లో ఆసీనులై పనులు చేసుకుంటున్నారు. ఆ సమయంలో కార్యాలయం ముందు ఒక పోలీసు జీపు వచ్చి ఆగింది. అందులోంచి ఒక ఎస్సై తన సిబ్బందితో దిగి సేరుగా ఎమ్.డి.గారి రూములోకి వెళ్ళి కొన్ని నిముషాలు మంతనాలు సాగించాడు. ఎమ్.డి.గారు తల పంకించి, తన రూములోకి చిన్నారావు అన్న సాఫ్ట్ వేర్ ఇంజనీర్ని రప్పించారు. పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకుని జీపు ఎక్కించి తీసుకుపోయారు.

ఉద్యోగులందరిలోను ఉత్కంఠ నెలకొంది. వారిలో వారు వేడి వేడిగా చర్చించుకోవడం మొదలుపెట్టారు.

' ఏం జరిగింది?'

' ఏం జరిగింది?'

' చిన్నారావుని పోలీసులు అరెస్టు చేసి తీసుకుపోయారు.'

' ఎందుకట?'

' తీవ్రవాదేమో!'

' ఛఛ, ఐ వుండడు.'

' చైను స్నాచరేమో!'

' ఇది మరీ దారుణం. అతడికేం ఖర్మ, దొంగతనాలు చేయడానికి?'

' దొంగతనాలు చెయ్యడానికి పేదరికమే కారణం కానక్కర్లేదు నాయనా. ఇప్పుడు పెద్ద పెద్ద కుటుంబాలలోని వారు, స్టూడెంట్లు ఎంతమంది చైనుస్నాచర్లుగా మారటల్లేదు?

' అంతేనంటావా?'

ఇంతలో ఎమ్.డి.గారి గదిలోంచి బైటకు వచ్చిన మెసెంజెరు దిగ్భ్రాంతికరమైన వార్త అందించాడు.

చిన్నారావు ఫేస్ బుక్ లో ఆడవాళ్ళను వేధిస్తున్నాడట! వందన అన్న ఒకావిడ అతడిమీద కంప్లైంటు ఇచ్చిందట.

మగాళ్ళు చర్చించుకుంటున్నారు. ' నో నో, నెవ్వర్! చిన్నారావు అల్లాంటివాడు కాడు. ఎవరో కావాలని అతడ్ని ఇరికిస్తున్నారు. అతడు ఎంత మర్యాదగా మాట్లాడతాడు! ఎప్పుడూ చిరునవ్వుతోనే వుంటాడు.'

' అవునవును. చిన్నారావు ఈజె పెర్ ఫెక్ట్ జంటిల్ మన్.'

ఒక యువతి అరిచింది, ' చాల్చాలు, ఊరుకోండి. మగాళ్ళముందర అతడు పెద్దమనిషిగా వుండక మరెల్లా వుంటాడు? ఆడవాళ్ళ దగ్గరే

అతడి నిజస్వరూపం తెలుస్తుంది. నేను ఎవరికీ చెప్పుకోలేదు. ఒకసారి నాతో అతిచనువు తీసుకోబోతే సీరియస్ గా వార్నింగిచ్చాను.' మరొకతను అన్నాడు, ' నిజమా? వాట్ ఎ సర్ప్రైజ్!'

మరొక యువతి అంది, ' ఔను. ఇప్పుడు విమల చెప్పింది కనక నేనూ ధైర్యం చేసి చెబుతున్నాను. నాతో కూడా చాలా సార్లు వెకిలిగా ప్రవర్తించాడు. నేను ఎవరికీ చెప్పుకోలేక, చెబుతే నేనే చులకనవుతానేమోనన్న భయంతో, నాలో నేనే ఏడ్చుకుంటూ వుండిపోయాను. వాడు చాలా రోగ్!'

మరొకామె అంది, ' ఔను. బయటపడే దాక ప్రతి మగవాడు పురుషోత్తముడే. బయటపడ్డాకే మృగాడవుతాడు.'

ఒక యువకుడు అరిచాడు, ' మేడమ్! మీరు అనవసరంగా మగవాళ్ళందర్నీ ఒకే గాటలో కట్టేస్తున్నారు. మేమంతా చాలా సభ్యత, సంస్కారం వున్నవాళ్ళం.'

' రోహిత్! ఇప్పుడు నువ్వు భుజం తడువుకోడమెందుకయ్యా? వాళ్ళు అందరి గురించీ కామెంట్ చెయ్యటల్లేదు. జరిగింది చాలా షాకింగ్ ఇన్సిడెంట్ కనక కొంచెం ఎక్కువగా రియాక్ట్ అవుతున్నారు. అది సహజం కదా!'

## కట్ చేస్తే

చిన్నారావుని ఇంటరాగేషను రూములో కూర్చోపెట్టి పోలీసులు అతిథి మర్యాదలు చేస్తున్నారు.

చిన్నారావు వాళ్ళ కాళ్ళా వేళ్ళా పడుతున్నాడు.

' నన్ను నమ్మండి సార్! నేను చాలా పెద్దమనిషిని. ఎప్పుడూ ఏ ఆడవాళ్ళ జోలికీ వెళ్ళేవాడిని కాను సార్. నేనేమిటో, నా ఉద్యోగమేమిటో. అంతేగాని ఏ విషయంలోనూ తల దూర్చను సార్.'

' మరి వందన నీమీద కంప్లెయింట్ ఎందుకిచ్చింది?'

' ఆ అమ్మాయి నాలుగైదు సార్లు నాకు ఫోను చేసి నన్ను ప్రేమిస్తున్నానని, పెళ్ళి చేసుకోమని వెంటపడింది సార్. నేనలాంటి వాడిని కాదని, నా మానాన నన్ను వదిలెయ్యమని బ్రతిమాలుకున్నాను సార్.'

' అల్లాగా పాపం! ఐతే ఆ అమ్మాయే నీ వెంటపడి వేధిస్తోందన్నమాట!'

' ఔను సార్! నా స్నేహితుల్నడగండి సార్, నేనెల్లాంటివాడినో.'

' మరి రికార్డ్సు చూస్తూంటే నువ్వే అస్తమానూ ఆ అమ్మాయికి ఫోన్లు చేస్తున్నట్లు వుంది కాని, ఆ అమ్మాయి నీకు ఎప్పుడూ ఫోను చేసినట్లు లేదే?'

' ఔను సార్! ఆ అమ్మాయి ఏం అఘాయిత్యానికి తలపడుతుందో అని భయమేసి నేనే నాలుగైదు సార్లు ఫోను చేసి ఆమెని బుజ్జగించాను సార్.'

ఈ తతంగం జరుగుతుండగా పోలీసు స్టేషనులోకి ఒక ముసలావిడ, ఒక ప్లీడరుగారు ప్రవేశించారు.

ఎస్సై గారు, ఆయన పేరు రుద్రప్ప, వారిని మర్యాదగా లోనికి ఆహ్వానించి కూర్చోబెట్టాడు.

ఆవిడ, పేరు అనంతమ్మ గారట, రుద్రప్పగారికి నమస్కరించింది. ప్లీడరు గారు, ఆయన పేరు కళ్యాణరావు, అన్నాడు, ' ఎస్సై గారూ, ఈవిడ చిన్నారావు తల్లిగారండి. పాపం ఈవిడకి వెనకా ముందూ ఎవరూ లేరండి. ఉన్న దిక్కల్లా ఈ కుర్రాడే. భర్త చిన్న వయసులోనే పోతే అష్టకష్టాలు పడి ఇతడిని పెంచి పెద్ద చేసిందండి. ఇతడికేదైనా ఐతే ఇంక ఆవిడకి ఆత్మహత్యే శరణ్యమండి.'

రుద్రప్పకి ఆవిడని చూడగానే గౌరవభావం కలిగింది. ప్లీడరుగారి దగ్గర బెయిలు కాగితాలు తీసుకుని, చిన్నారావుని వాళ్ళకి అప్పగించాడు.

ప్లీడరు గారు లౌక్యంగా అన్నాడు, ' రుద్రప్పగారూ, ఎక్కడో ఏదో కమ్యూనికేషను గేప్ వచ్చివుంటుందని నా అనుమానం. చిన్నారావు అల్లరి చిల్లరి కుర్రవాడేం కాదండీ. ఏదో తెలిసీ తెలియని కుర్రతనం. తెలియక ఏదైనా తప్పుచేస్తే మనం పెద్ద మనసుతో చూసీ చూడనట్లుండాలి. అందుకే మీరు కాస్త ఉదారంగా వ్యవహరించాలని నా రిక్వెస్ట్. మీ మేలు మరిచిపోము.'

రుద్రప్పకి ఆవేశం ముంచుకొచ్చింది. ' అవును నాయనా! కుర్రతనం కొద్దీనే మగవాళ్ళు ఆడపిల్లలని వేధిస్తున్నారు. కుర్రతనం కొద్దీనే వయసుతో కూడా నిమిత్తం లేకుండా మానభంగాలు చేస్తున్నారు. కుర్రతనం కొద్దీనే ఆడవాళ్ళ మీద యాసిడ్ దాడులు చేస్తున్నారు. కుర్రతనం కొద్దీనే అభం శుభం తెలీని ఆడపిల్లలని కత్తులతో నరికి చంపుతున్నారు. ఐనా మనం పెద్దమనసుతో చూచీ చూడనట్లుండాలి.' అని గట్టిగా అరవాలనుకున్నాడు. కాని ఏమిటి ఉపయోగం? న్యాయవాదులు అన్యాయాలకి కొమ్ముకాస్తూ కోర్టులలో వాదించడమా? ఛీ, ఛీ, ఎటు పోతోందీ దేశం? పైకి ఏమనలేక లోపల్లోపల పళ్ళు నూరుకున్నాడు.

పైకి గంభీరంగా అన్నాడు, ' సరి, తరవాత మాట్లాడదాం లెండి. ముందు మీ కుర్రవాడిని తీసికెళ్ళండి.'

వాళ్ళు రుద్రప్పకి నమస్కరించి వెళిపోయారు.

రుద్రప్పకి చాలా బాధ కలిగింది. ఆయనకి తన తల్లి గుర్తుకు వచ్చింది. తమది చాలా పేదకుటుంబం. తండ్రి రిక్షా లాగుతూ కుటుంబాన్ని పోషిస్తూ తనని స్కూల్లో చదివించేవాడు. అటువంటిది, ఒక దుర్దినాన, రోడ్డుమీద రిక్షాలో ఎవరినో తీసికెడుతూంటే, వెనకనించి సిటీబస్సు వచ్చి గుద్దేసింది. తన తండ్రి అక్కడికక్కడే మరణించాడు. దాంతో తమ కుటుంబం పరిస్థితి మరీ హీనమై పోయింది. తను చదువు మానేసి రిక్షా తొక్కుతానంటే తన తల్లి ఒప్పుకోలేదు.

' నాయనా! డాక్టరు కొడుకు డాక్టరు కాగలుగుతున్నాడు. సినిమా హీరో కొడుకు సినిమా హీరో కాగలుగుతున్నాడు. దానిక్కారణం డబ్బు. డబ్బు డబ్బుని సంపాదిస్తుందిరా. కాని మనం దరిద్రులం. అంతమాత్రాన రిక్షావాడి కొడుకు రిక్షావాడిగానే మిగిలిపోవాలా? అల్లా నేను కానివ్వనురా. ఆ రిక్షా ఏదో నేను తొక్కుతాను. నువ్వు మాత్రం చదువు ఆపేస్తే నా మీద ఒట్టే.'

రుద్రప్ప హృదయం మూగగా రోదించింది. ' అమ్మా! నా కోసం ఎన్ని కష్టాలు పడ్డావమ్మా? నీ ప్రతి చెమట బిందువు నా జీవితంలో అమృతధార కురిపించి, నన్నీనాడు పోలీసు ఆఫీసరుగా చేసి ఈ సమాజంలో నిలబెట్టింది కదమ్మా. కాని సుఖపడే రోజులు వచ్చేసరికి నువ్వు మాత్రం, నీ కర్తవ్యం ఇంక ముగిసిందని నాన్న దగ్గరికి వెళిపోయావు కదమ్మా? నీ ఋణం తీర్చుకోలేని అభాగ్యుణ్ణమ్మా. కాని నువ్వు చెప్పిన పాఠాలన్నీ నాకు గుర్తున్నాయమ్మా. అవెప్పుడూ నాకు కర్తవ్యబోధ చేస్తూనే వుంటాయమ్మా.'

## కట్ చేస్తే

అనంతమ్మ, చిన్నారావు ఆటోలో ఇంటికి చేరుకున్నారు. ఇంటికి రాగానే చిన్నారావు అమ్మని కవుగలించుకుని భోరుమన్నాడు.

' అమ్మా, ఆ వందన దొంగముండమ్మా. నా జీవితాన్ని నాశనం చెయ్యాలని నా మీద కక్షగట్టి పోలీస్ కంప్లెయింట్ ఇచ్చిందమ్మా.'

అనంతమ్మ తీక్షణంగా కొడుకు కేసి చూసింది. ' ఒక ఆడపిల్లని ముండ, రండ అనడానికి సిగ్గులేదూ నీకు? చేసిన వెధవ పని చాలక ఇంకా ఆ పిల్లని తిడుతున్నావా?'

' అదికాదమ్మా, ఇప్పుడు నామీద కేసు ఫైలు ఐతే నా జీవితం నాశనం ఐపోతుంది కదమ్మా.'

' మరెందుకు చేసావు అల్లాంటి పాడుపని?'

చిన్నారావు ఏమేమో చెబుతున్నాడు. కాని అతడి మాటలేవీ ఆమె చెవుల్లోకెళ్ళటల్లేదు. ఆమెకి తన గతమంతా గుర్తుకు వస్తోంది.

' మన అనంతలక్ష్మి ఏ జన్మలోనో బంగారు పువ్వులతో గౌరీదేవికి పూజ చేసుకుని వుంటుంది. అందుకే బంగారం లాంటి సంబంధం వచ్చింది.'

' ఔనమ్మా. కుర్రాడికి బ్యాంకులో ఉద్యోగమట. ఇంక మన లక్ష్మి నోట్లమీదే నడుస్తుంది.'

' నిజమమ్మా. అందుకే వాళ్ళు కట్నం చాలా అడిగినా, తాహతుకి మించి సిద్ధపడ్డాడు అమ్మాయి నాన్నగారు.'

' మంచి పని చేసాడు. లేకపోతే కాళ్ళదగ్గరకి వచ్చిన సంబంధం చేజార్చుకుంటే మళ్ళీ ఇటువంటి మంచి సంబంధం దొరుకుతుందా? '

అనంతలక్ష్మి వాళ్ళ మాటలు వింటూ పొంగిపోయింది. అంతా తన అదృష్టం. లేకపోతే ఏడవతరగతి అన్నా చదవని తనకి ఇంత మంచి సంబంధం కుదరడమేమిటి? అంతా ఆ తల్లి అనుగ్రహం అని తలుచుకుంటూ సంబరపడి పోయింది.

చూస్తూ చూస్తూ వుండగానే, పెళ్ళి ముహూర్తం దగ్గరవడం, పెళ్ళి కావడం, అనంతలక్ష్మి కాపురానికి వెళిపోవడం జరిగిపోయాయి.

కాని తన జీవితం పరిచిన పూలపానుపు కాదని అనంతలక్ష్మికి తెలియడానికి ఎన్నో రోజులు పట్టలేదు.

ఆమె భర్త సకల గుణాభిరాముడు. పేరు గుణశేఖర్. కాని అతడిని దుర్గుణశేఖర్ అంటేనే సబబుగా వుంటుందేమో. ఎందుకంటే అతడికి ఫలానా అలవాటు లేదు అని చెప్పాలంటే తప్పనిసరిగా అబద్ధం ఆడాల్సివుంటుంది.

అనంతలక్ష్మి అన్నింటికీ రాజీపడి బండగా జీవించడం అలవాటు చేసుకుంది. కాని ఆమెకు రోజులు అల్లా కూడా గడవలేదు. ఆమెకు బిడ్డ పుట్టి, అతడికి తొమ్మిదేళ్ళ వయసు వచ్చేసరికి, సకల దుర్గుణాభిరాముడు ఐన ఆమె భర్త అనేక రోగాల బారిన పడి పైలోకాలకి వెళిపోయాడు.

కంపేషనేట్ గ్రౌండ్స్ మీద బ్యాంకు వారు ఆమెకి ఉద్యోగం ఇచ్చారు. ఐతే ఆమె ఏడవ తరగతి కూడా చదవనందువల్ల ఆమెకు బ్యాంకులో మెసెంజరుగా ఉద్యోగం ఇచ్చారు. తన భర్త పని చేసిన ఆఫీసులోనే తను బంట్రోతుగా పని చెయ్యవలసి రావడంతో ఆమె మానసికంగా బాగా క్రుంగిపోయింది. ఐనా తప్పదు. ఉన్న ఆస్తినంతా మగడు మహారాజు ఎప్పుడో హారతి కర్పూరం చేసేసాడు. ఇంక తన ముసలి అత్త మామల్ని సంరక్షించుకోవాలన్నా, తన కొడుకు చిన్నారావుని పైకి తీసుకు రావాలన్నా తను ఉద్యోగం చేసి తీరాలి. గుండె బండ చేసుకుని అనంతలక్ష్మి ఉద్యోగంలో చేరింది. ఆ తరవాత పట్టుదలగా చదివి పదవతరగతి పేసయింది. ఆపైన బ్యాంకు వారు పెట్టిన పరీక్షలో ఉత్తీర్ణురాలై గుమాస్తాగా ప్రమోషను సంపాదించుకుంది. ఆమె జీవితంలో ఏ సుఖమూ ఎరుగదు. ఆమె ఏ సుఖమూ కోరుకోలేదు. తన కొడుకు ప్రయోజకుడైతే ఇంక తనకేమీ అక్కర్లేదనుకుని, అతడి బాగే తన ధ్యేయంగా, అహర్నిశలు పాటుపడి అతడిని బి.టెక్. దాకా చదివించింది.

కాని అనంతలక్ష్మి జీవనయానంలో బంగారు మజిలీలన్నవి లేనే లేవు. ఇదుగో, ఈ రోజున చిన్నారావు ఈ సమస్య తెచ్చిపెట్టాడు.

' అమ్మా! మాట్లాడవేమిటమ్మా? నా మాటలు వినడంలేదా?' అని చిన్నారావు కుదుపుతూ అడుగుతూంటే మళ్ళీ ఈ లోకంలోకొచ్చింది అనంతలక్ష్మి.

' ఏమిట్రా నువ్వంటున్నది?'

' అవునమ్మా. నువ్వు వందనతో మాట్లాడితే ఈ సమస్య పరిష్కారమైపోతుంది. నువ్వూ ఆడదానివే కనక, వయసులో పెద్దదానివి కనక, నీ మాటలు వందన తప్పకుండా విని కేసు విత్ డ్రా చేసుకుంటుంది. అప్పుడింక ఏ బెంగా వుండదు. ఇప్పుడే నువ్వు వందనతో ఫోను చేసి, మా అబ్బాయి ఏదో చిన్న పిల్లాడు. తెలియక అలా ప్రవర్తించాడు. నువ్వు పెద్దమనసుతో క్షమించమ్మా. పెద్దదానినైనా నేను నీ కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడుతున్నా అని కాస్త నువ్వు జాలిగా మాట్లాడావనుకో, దెబ్బకి కరిగిపోయి ఆ అమ్మాయి ఒప్పేసుకుంటుంది. అమ్మా, అమ్మా, వెంటనే నువ్వు వందనకి ఫోను చెయ్యమ్మా.'

వందనకి గుండెలు బరువెక్కి పోయాయి. ' హు! ఓ స్త్రీ! ఓ త్యాగమయీ! నువ్వు కొవ్వొత్తిలా కరిగిపోవడానికే పుట్టావు సుమా! మగమహారాజులు ఎన్ని వేషాలేసినా చెల్లుతుంది. కాని నువ్వు మాత్రం ఈ పవిత్ర భారతదేశంలో పుట్టిన దానివి. నువ్వు ఎప్పుడూ అణిగి మణిగి వుండాలి. పొద్దున్న లేవగానే పతిదేవుడి పాదపద్మాలు కళ్ళకద్దుకుని, అప్పుడు మంచం మీంచి లేవాలి. భర్త అన్నం తిన్నాక, ఆ కంచంలోనే ఆయన వదిలేసిన మెతుకుల్ని ప్రసాదంగా భుజించాలి. నువ్వు శ్రావణ మంగళవారాలు నోములు నోచాలి. వరలక్ష్మీ వ్రతాలు చెయ్యాలి. ఉపవాసాలుండాలి, పూజలు చెయ్యాలి. ఎందుకో తెలుసా? నువ్వు అఖండ సౌభాగ్యవతిగా వుండడానికి. నీ పతిదేవుడు సకల సుఖాలు అనుభవించడానికి. అతడి వంశాన్ని నువ్వు అభివృద్ధి చెయ్యడానికి. ఆ తర్వాత కూడా నువ్వు నీ కొడుకు సంరక్షణలోనే బ్రతకాలి సుమా! మనువు గారు చెప్పనే చెప్పారు కదా? నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి అని. అందుకని నువ్వెప్పుడూ బానిసలాగే బ్రతకాలి. చిన్నతనంలో తండ్రి చాటున, యవ్వనంలో భర్త మాటున, వృద్ధాప్యంలో కొడుకు సంరక్షణలోను మాత్రమే నువ్వు జీవించాలి. లేకపోతే నీ బుద్ధి పెడదారులు పడుతుంది. మగమహారాజు ఈ సంఘంలో ఏంచేసినా చెల్లుబాటవుతుంది సుమా!'

అనంతలక్ష్మి రక్తం పొంగిపోసాగింది. గంభీరంగా ' సరేరా, ఫోనియ్యి.' అంది.

చిన్నారావు పొంగిపోతూ వందన నంబరు డయలు చేసి తల్లికిచ్చాడు.

ఆటునించి వందన ఫోనులో ' హలో, ఎవరూ మాట్లాడుతున్నదీ?' అంది.

అనంతలక్ష్మి సిగ్గుపడిపోతూ, ' నా పేరు అనంతలక్ష్మి అమ్మా. నేను చిన్నారావు తల్లిని.' అంది.

ఇంకా అనంతలక్ష్మి ఏమన్నా మాట్లాడే లోగానే వందన ప్రవాహంలా మాట్లాడెయ్యసాగింది.

' ఆంటీ, నాకు తెలుసు. ఏ క్షణాన్నైనా మీనుంచి నాకు ఫోను వస్తుందని. కాని నేను చెప్పే నాలుగు మాటలు ముందు మీరు వినండి ఆంటీ. ఆతర్వాత మీరు మాట్లాడుదురుగాని. ఇక్కడ మేమంతా ' తెలుగుజాతి మనది ' అన్న వెబ్ సైట్ పెట్టుకున్నాం ఆంటీ. అందులో మగవాళ్ళు, ఆడవాళ్ళు పిల్లలు, పెద్దలు అందరూ వయసుతో నిమిత్తం లేకుండా ఊసులాడుకుంటూ వుంటాం. ఒక రకంగా ఇది ఒక సత్సంగం అనుకోండి. ఒకళ్ళ భావాలు ఒకళ్ళు పంచుకోవడం, ఒకళ్ళ భావాలనొకళ్ళు గౌరవించుకోవడం, కాసిని లౌకికమైన విషయాలు, కాసిని ఆధ్యాత్మికమైన విషయాలు, కాసిని కళలకు సంబంధించిన కబుర్లు - ఇలా ఎన్నో, ఎన్నెన్నో. దీని ద్వారా కాస్త మానసిక వికాసం, కాస్త మనసుకి విశ్రాంతి, రాబోయే రేపుని మరింత ఆశావహంగా గడపడానికి కావల్సిన స్ఫూర్తి - ఇవి దొరుకుతున్నాయమ్మా మాకు. అటువంటిది, మధ్య మధ్యలో మీ అబ్బాయి వంటి వారు వచ్చి, పాలల్లో ఉప్పురాళ్ళలా వాతావరణాన్ని పాడుచెయ్యడానికి ప్రయత్నిస్తున్నారాంటీ. మీ అబ్బాయి చిన్న వాళ్ళు, పెద్దవాళ్ళు అని కూడా చూడకుండా చాలామందితో అసభ్యంగా ప్రవర్తించాడాంటీ. మాకు చాలా మానసికి వేదనని కలిగించాడు. మీకు కొన్ని సంఘటనలు చెబుతాను..................................'

అనంతలక్ష్మి మౌనంగా వింటూ వుండిపోయింది.

'..............ఇప్పుడు చెప్పండాంటీ.  ఇన్ని జరిగాక కూడా నన్ను మౌనంగా వుండిపోమంటారా?  మీరు కూడా సాటి స్త్రీయే.  అందుకని మీరేం చెప్పినా నేను తప్పకుండా వింటాను.  నన్నేం చెయ్యమంటారో మీరే చెప్పండాంటీ.'

అనంతలక్ష్మి ఎగదన్నుకొస్తున్న ఆవేశంతో ఊగిపోతూ అరిచింది, ' నువ్వసలు ఆడదానిగా పుట్టినట్టయితే, నీలో ఏ కాస్త చీమూ నెత్తురూ అన్నా వున్నట్లయితే ఈ కేసు అంతు చూడు.  అంతేగాని మధ్యలో రాజీ పడకు.  అల్లా మనం రాజీ పడుతూనే యుగయుగాలుగా అన్యాయాలకీ, అత్యాచారాలకీ గురౌతున్నాం.  ఇప్పుడన్నా వీటికి ఫుల్ స్టాప్ పెడదాం.  దానికి నీ వంతు బాధ్యత నువ్వు నిర్వర్తించు.  విష్ యూ గుడ్ లక్!"
అంటూ ఫోను పెట్టేసింది.

చిన్నారావు తల్లికేసి నిశ్చేష్టుడై చూస్తూ వుండిపోయాడు.

చిన్నారావుకి జైలు శిక్ష పడింది.  అనంతలక్ష్మి ఏడుస్తూ కొడుకుని కౌగలించుకుంది.

చిన్నారావు నిరసనగా అన్నాడు, ' ఛీ!  నువ్వసలు నా కన్నతల్లివేనా అమ్మా?'

అనంతలక్ష్మి ఏడుస్తూ అంది, ' ఔనురా.  నేను నీ కన్నతల్లినే.  కాని అంతకన్నా ముందు ఈ భారతదేశంలో పుట్టిన ఒక అభాగ్యురాలైన అబలని.  అందుకే నా బాధ్యత నేను నిర్వర్తించాను.  ఒరేయి చిన్నా!  జైలులో నీకు కాలక్షేపంగా వుంటుంది.  ఈ పుస్తకం చదువుకుంటూ వుండు.' అంటూ అతడి చేతిలో ఒక పుస్తకాన్ని వుంచింది.

చిన్నారావు ఆ పుస్తకం కేసి చూసాడు.

అది భగవద్గీత!!!

❖❖❖❖❖



WESTMEAD DOCTORS



**Shop 6, Coles Complex**
**29-33 Darcy Road**
**WESTMEAD**

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE

## GENERAL PRACTICE

Telugu and
Hindi speaking
Female GPs
Male GPs

## ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

## SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

## ONSITE PATHOLOGY

# కరోనా గృహనిర్బంధం వివిధ కోణాలలో తెలుగువారి జీవన విధాన శైలి

శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ

## హాస్య వీక్షణం

తెలుగు ఉగాది శార్వరిసంవత్సరం చాలా నిశ్శబ్దంగా తెలుగువారి జీవితాలలోకి ప్రవేశించింది.అవును పేరులోనే చీకటి ఉంది.

ఈ క్రొత్త సంవత్సరం క్రొంగొత్త జీవిత సత్యాలను బోధించింది.

గుండెలోతులలో దాగి ఉన్న ఆత్మీయ అనుబంధాలు కుటుంబ వాతావరణంలో చవి చూస్తున్నాము

శుచి, శుభ్రత, మడి, దడి అంటూ అమ్మమ్మ, బామ్మ నేర్పిన అలవాట్లు ఇప్పుడు అక్కరకు వచ్చాయి ప్రపంచమంతటికి.

పాశ్చాత్య దేశాలలో అడుగిడినా, మనకు అబ్బబ్బ రోడ్డు మీద కనబడే చుంబన దృశ్యాలు, ఆలింగన అగచాట్లు చూడలేకపోయేవాళ్ళము, వాటికి కొన్నాళ్ళు పూర్ణవిరామం.

విచ్చలవిడి, విశృంఖలత్వం కూడదు మీ హద్దుల్లో మీరుండండి అంటూ ఒక సూక్ష్మజీవి యావత్ ప్రపంచాన్నే నిర్దేశించింది.

**ముఖేముఖే సరస్వతి, నమస్కారం** అంటూ పలకరించుకున్న చాలు.

కరచాలనం అవసరం లేదు సుమా అంటూ భారతీయ సంస్కృతిని చాటిచెప్పిన నేటి పరిస్థితి కలగన్నానా!.. ఏనాడైనా!... కానీ ఇది నిజం, సత్యం, కనులముందు జరుగుతున్న యదార్థం.

ప్రపంచంలో ప్రతిచోట జనజీవనం స్థంభించింది.

విలాసాలతో స్వర్గాన్ని మైమరపించే భూతలస్వర్గంగా విలసిల్లే న్యూయార్క్ నగరం ఇంకా మరెన్నో మహానగరాలుఇపుడు కరోనా కాటుతో కంపించిపోతున్నాయి.

బయటికి వెళ్ళారంటే కరోనా బూచి కబళిస్తుంది. ఇంట్లోనే ఉండండి అంటూ ప్రభుత్వ యంత్రాంగం కట్టడి చేసింది.

తెలుగువారం ఎక్కడున్నా తెలుగువారమే.

మిన్ను విరిగి మీదపడ్డా తమకున్న పరిధిలో పరిస్థితులను చక్కబెట్టగలిగే సమర్థులు మన తెలుగువారు.

ఇపుడు ఈ కరోనా తెలుగు జీవితాలలో ఎంతవరకు ప్రభావితం చేసిందో చూద్దాం.

"ఏమోయ్ ఇదిగో నేను ఆఫీస్ కి వెడుతున్నాను. తలుపేసుకో.

ఇంటికి రాగానే నాకు మాంఛి వేడి వేడి , పకోడీలు, వంకాయ ధనియాలకారం కూర, సాంబార్, కొబ్బరి పచ్చడి చేసి ఉంచు." అది కరోనాకు ముందు పరిస్థితి.

"అమ్మకేమి తెలియదు. గరిటె బాగా తిప్పుతూ వంట చేయడమే బాగా తెలుసు" అనుకునే చిన్నారి, ఆశ్చర్యపోయిన తరుణమేమన

"అమ్మో!, అమ్మ నిబద్ధత, నియమం కలిగిన ఉద్యోగి మై రోల్ మోడల్"

"ఓహ్ నా శ్రీమతి ఉత్తమ ఇల్లాలే కాదు అత్యుత్తమ కార్యనిర్వాహకురాలు సుమా!"... సదరు భర్త గారి మనసులో అభిప్రాయం ప్రశంస మటుకు ఇవ్వరాయె.. ఇస్తే ఇంకేమైనా ఉందా... అందలం ఎక్కేయదు!

మరోప్రక్క కరోనాకు ముందు ఆ గృహిణి ఆదరాబాదరాగా, రాత్రి మిగిలిన చద్దికూడుని బాక్స్ లో పెట్టుకుని తిని తినక, స్టీరింగ్ వీల్ చేతబట్టి కారులో ఆదిత్యహృదయం వల్లిస్తూ కంటికెదురుగా కనిపించే సూర్యదేవునికి నమస్కారం చేసుకుని పని ప్రారంభించే మగువకు, దేవతలు మెచ్చి, "తరుణి వలదు, ఇబ్బంది వలదు.

హాయిగా ఇంటి పట్టున ఉంటూ వేడివేడి తెలుగురుచులు ఆస్వాదించు" అంటూ దేవతలు వరమిడగా....

ఇంకేముంది ఝూమ్మని ఆ కంప్యూటర్ నే గల్లాపెట్టెగా భావిస్తూ, ఇంట్లో ప్రతి ఒక్కరు ఒక్కో గదిని ఆఫీసుగా మార్చేసుకుంటున్న వైనం

ష్... ష్! ఫోన్ లో ఉన్నారు గలాటాలు వద్దు.

అరచేతిలో వైకుంఠం. కంప్యూటర్ అంతర్జాలంలో క్లాసురూములు

ప్రక్కనే ప్లేట్లో చిరుతిళ్ళు

అనుకోని రీతిలో జీవనవిధానమే మారిపోయే!

ఉగాది సంబరాలు తెలుగువారమంతా ఆనందంగా ఒకచోట చేరి సందడి చేయలంటూ తేదీ, వేదిక గురించి తర్జన, భర్జనలు పడుతుండ ఒకచోట.....

మరోచోట పెళ్ళిళ్ళు స్వర్గంలోనే జరుగుతాయంటారు. ఆకాశమంత పందిరి వేసి వైభవంగా పెళ్ళి జరిపించే హడావిడి, రంగురంగుల పట్టుచీరలు, జిగేల్ మంటూ ధగధగ మెరిసే నగలతో కాంతలు సిద్ధమగుచుండె...

"ఇంతింత ఆర్భాటాలు మీకిపుడు అవసరమా చూడండి, అన్నీ బంద్ . వచ్చేస్తున్నాను. నాకు ధనిక, పేదా తేడా లేదు. రాజు -రైతు అందరూ ఒకటే.

మీ ఆలోచనలన్నీ గల్లంతు. హుష్ కాకి. హుళక్కి.

ఎలా తరిమికొట్టాలో తలలు పట్టుకునేరు. నేను మీకు అంతుచిక్కని మహమ్మారిని.

రావణాసురుడు పదితలలతో వస్తే, కుంభకర్ణుడు భీకరమైన తిండిపోతుగా...

మహిషాసురుడు దేవతాగణాలను గడగడలాడించగా.. ఒక్కో రాక్షసున్ని అంతమొందించడానికి ఒక్కో అవతారం ఎత్తి దేముడు వస్తే...

ఇపుడు నన్ను ఎదుర్కోవడానికి ఎవరు వస్తారు. ఇది కలియుగం."

హాహాహా కరోనా హాహాకారాలతో ప్రపంచమంతా బలి అవుతున్న వేళ...

వైద్యో నారాయణో హరి.. ప్రాణాలు రక్షించడానికి కవచంగా ఏర్పడుతూ అందిస్తున్న సేవలు.

"హన్నా కరోనా..

భారతీయులని, తెలుగువారిని తక్కువ అంచనా వేయకు."

ఎక్కడైనా, ఎలాగైనా బ్రతికేయగలడు సగటు తెలుగువాడు.

కాసింత బియ్యం, పప్పు ఉంటేచాలు. హాయిగా ఆవకాయ, పెరుగుబిళ్ళ వేసుకుని ఆరగించి, కడుపు నింపుకునేవారు.

ఇంకా చూస్తే శెనగపిండితో పసందైన పిండివంటలు.

ఇంటిముంగిటకు వచ్చే కూరగాయలతో భేషైన రుచులు.

ఇంట్లోనే దైవధ్యానం, ప్రవచనాలు వింటూ ఘటనాఘటన సమర్థులు తెలుగువారు.

బుల్లితెరలో రామానంద్ సాగర్ రామాయణం, ఛోప్రా భారతం వీక్షణాలు.

"ఆహా! ఓహో! నా శ్రీమతిలో ఎవరూ తీసుకురాలేని మార్పు ఈ కరోనా తీసుకువచ్చింది. ఇంటింట రణగొణ ధ్వనులు, పిచ్చి చేష్టలు, హింసను ప్రేరేపించే సీరియల్స్ ఆగిపోయెగా.."

డబ్బు ఖర్చు పెట్టకుండా తేలికగా అందుబాటులో దొరుకుతున్న పాతబంగారానికి కొదవే లేదు అవేఎన్టీఆర్, ఏఎన్నార్ తెలుగు సినిమాలు.

మూల నక్కినక్కిన తెలుగు సాహిత్య కుసుమాలు చేతిలో చేరాయి. పెరటివంక కన్నెత్తైనా చూడని పెద్ద, చిన్నా, ఇంటిల్లిపాది ఒకచోట చేరి మొక్కల సంరక్షణ, తోటపనులు...

**వేలకు వేలు, లక్షలు, మిలియన్లు గుమ్మరించి కొన్న లంకంత ఇంటికి ఇప్పుడు కదా అసలైన గిట్టుబాటు. మునుపు ఇంటిపట్టున ఉంటే ఒట్టు.**

ఇపుడు ఇల్లే కదా స్వర్గం. ఇల్లాలే దేవత. పార్టీ లేదు. పరాకు లేదు.

క్రొత్త ప్రేమలు చిగురించె మనుషుల మధ్య మమతలు, విలువలుపెంపొందె

పార్టీలు, సమావేశాలు ఎదురుబదురుగా కాక, ఒకరినొకరు తాకకుండా...

జూమ్ జూమ్ మాయ! ఇదిగో ఇదే జూం జూం మాయ!

జూమ్ జూమ్ వీక్షణలతో, సాహితీ సదస్సులతో కొలువైన మనందరం

సత్సంగాలు, ప్రవచనాలు, భగవత్  ప్రార్ధనలు, సంగీత కచేరీలు, గానా భజానాలు ఒకటేమిటి, ఏదైనా చేయగలం.

మాకు విసుగు లేదు. విరామం లేదు. లాక్ డౌన్ ని అనుకూలంగా మార్చుకోగలగటం మా సత్తా.

ఎన్నడూ చూడలేదు, ఎపుడూ ఎదుర్కోని పరిస్థితి.

ప్రాచీనంగా వస్తున్న మన తరతరాల సంప్రదాయం, తరగని సాహిత్య సంపద.

ఇన్ని రుచులు, వ్యాపకాలు, సంస్కృతి, సంప్రదాయాల కలబోత మా తెలుగువారి ప్రత్యేకత.

❖❖❖❖❖

## సాహితీ వీక్షణం

గత నెల మే మాసంలో భువనవిజయం తెలుగుమల్లె వారు శ్రీ కొంచాడ రావు గారు అంతర్జాతీయ సాహితీ సదస్సు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు సాహితీ ప్రముఖులు శ్రీ వంగూరి చిట్టెన్ రాజు గారు, శ్రీ ఆకెళ్ళ రాఘవేంద్ర, విజయ గొల్లపూడి, రఘు విస్సంరాజు, రావిపాటి కృష్ణ, యెస్వీ సత్యనారాయణ, అప్పరసు కృష్ణారావుగారు, సాక్షి దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ ఆంజనేయులు, ఇంకా పలువురు ప్రముఖులు  హాజరైనారు.ప్రస్తుత పరిస్థితి కరోనా ప్రధాన అంశంగా ఈ సాహితీ సదస్సులో ప్రసంగించారు.




❖❖❖❖❖







సిడ్నీ తెలుగు వాహిని రెండవ

సాహితీ సదస్సుకు ఆహ్వానం



సిడ్నీ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో

తెలుగువాహిని రెండవ సాహితీ సదస్సు

నిర్వహించబడుతోంది

వేదిక: **Online Zoom**

తేది: **జూన్ 20, 2020**

సమయం: **03:00 pm – 5:00 pm**


**తెలుగుభాషా ప్రేమికులకు, సాహిత్యాభిమానులకు, వాహిని పాఠకులకు రెండవ తెలుగుసాహితీ సదస్సుకు ఇదే మా ఆహ్వానం. చక్కనైన, మన తీయనైన తెలుగు భాషలో ఉపన్యాసాలకు వేదిక. మీలో తెలుగు భాష, సాహిత్యం, కవులు, రచనలు అంశాలపై ప్రసంగించదలుకున్నవారు మీ పేరు నమోదు చేసుకోవాలని మనవి చేస్తున్నాము.**


వివరాలకు సంప్రదించండి:

శ్రీమతి విజయ గొల్లపూడి 0438 293 687

ఆసక్తి ఉన్న వక్తలు త్వరగా మీ పేరును నమోదుచేసుకోవలసిందిగా కోరుతున్నాము. మీరు ప్రసంగించవలసిన అంశం వివరాలు ఈ మెయిలు ద్వారా vahini@sydneytelugu.org కు పంపండి.


## సరసి కార్టూన్స్


వాళ్ళు మాత్రం ఎంతమందికని చేస్తారు టెస్టులూ?! అందరికీ
తలో మిషనూ ఇచ్చేస్తే మనమే చేసుకుంటాంగా!
సరసి


టాబ్లెట్లు వేసుకున్నానో లేదో గుర్తుండదు!
డవుటొస్తే ఆ కెమెరా ఫుటేజి చూస్తా!!
సరసి

# సున్నాలేద్దాం రా!

శ్రీ సరసి సరస్వతుల,హైద్రాబాద్




“డాక్టర్ గారూ, ఈయన మా ఆయన. ఒక్క నిమిషం కూడా నిటారుగా నిలబడలేకపోతున్నారు.” కన్నీళ్లు పెట్టుకుంది భార్య. డాక్టర్ పరీక్షించాడు. కాళ్ళు బలంగానే ఉన్నాయి. వేరే జబ్బులేం లేవు. బుర్రలో ఏదో వెలిగింది! టేబుల్ మీది ట్రే లోంచి ఓ సుద్ద ముక్క తీసి నేల మీద ఓ పెద్ద సున్న చుట్టి అందులో నిలబడమన్నాడు. ఆశ్చర్యం! చక్కగా నిలబడ్డాడు పేషంటు! “జబ్బేమీ లేదమ్మా. దుకాణాల వద్ద క్యూల్లో సున్నాల్లో నిలబడ్డం అలవాటయి, అవి లేని చోట నిలబడలేకపోతున్నాడు అంతే !” అని చెప్పి పంపేడు, ఒకటి పక్కన మూడు సున్నల సొమ్ము వసూలు చేసి.

‘పరమానందయ్య శిష్యులు’ సినిమాలో పరమానందయ్య గారు “పెళ్లి దగ్గరకొచ్చేస్తోంది. ముందు ఇంటికి సున్నాలెయ్యాలిరా” అంటే శిష్యులు ఎదురింటికి ‘సున్నం’ వేసొచ్చారు!

మన ప్రస్తుతాంశం గోడల మీది సున్నాలు కాదు, నేల మీది సున్నాలు!

ప్రతి రోజూ మన ఇళ్ల ముందు కళకళ లాడుతూ కనిపించే ముగ్గులిపుడు దుకాణాలు,బస్సు స్టాండ్లు, రైల్వే స్టేషన్లలో కనిపిస్తున్నాయి సున్నాలు, చతురస్రాలు, ఇంటూల రూపంలో!

ఇవి ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా గోచరిస్తున్నాయి. ఒకావిడ భర్తతో అంటోంది. “యావండీ ఈ సున్నాలు మీ అమ్మ గారు సగం కాల్చిన చేగోడీల్లా లేవూ?” అని. భర్త కొరకొరా చూసాడామె వంక. నిజానికి చిన్నప్పటి తన స్కూల్ ప్రోగ్రెస్ కార్డులు నేల మీద పరిచినట్టు అనిపిస్తోంది అతనికి. ఈలోగా కూతురు “డాడీ ఓ రూపాయి కాయిన్ ఇవ్వవా” అని అడిగి తీసుకుని ముందుకి విసిరి ఒంటి కాలిమీద ఒక సున్న లోంచి ఇంకో దానిలోకి గెంతుతూ తొక్కుడు బిళ్ళాట ఆడసాగింది!

అవతలి లైన్లో ఇంకో ఫార్సు! ధుమధుమ లాడుతున్నాడొక పెద్దాయన. “వాస్తు ప్రకారం అసలిక్కడ సున్నా చుట్టకూడదండీ. ఏమాత్రం బరువుండకూడదు ఇటువైపు.” అన్నాడాయన వెనకాయనతో. వెంటనే ఆయన అందుకున్నాడు. “అలా కొట్టిపారెయ్యకండి సార్! వాస్తు లేకపోవచ్చు కానీ ఎన్ని విద్యలున్నాయో తెలుసా ఈ సున్నల్లో? సోషలు, సైన్సు, మాథ్స్, డ్రాయింగు, క్రాఫ్టు - ఇన్నున్నాయి.

సోషల్ డిస్టెన్సులో సోషలుంది! సున్నాల్లో కాక దగ్గరగా నిలబడ్డామనుకోండి. వచ్చేది ఏవిటీ? జబ్బు! అది సైన్సు! సున్నకి సున్నకి మధ్య కనీసం మూడడుగులు లెక్క ఉంది కదా? అది మేథమెటిక్సు. సున్నల్ని గుండ్రంగా చుట్టడం వుంది చూశారూ అది డ్రాయింగు! చుట్టే పని క్రాఫ్టు! ఇలా ఇంత విజ్ఞానం ఉంది ఈ సున్నాల వెనక. అంతే కాదు అసలు ఈ సున్నాని కనిపెట్టిందే మన దేశం వాడు! కనిపెట్టి ఒరేయ్, ఈ జీవితాలు అశాశ్వతంరా, అందరూ కలిసిమెలిసి ఉండండ్రా అని ప్రపంచ దేశాలకు చెవులు చిల్లులు పడేలా చెప్పేడు! శంకరాచార్యులవారు చెప్పలేదా 'జగన్మిథ్య' అని! ఎవడన్నా వింటేగా? అందుకే ఇన్ని వైపరీత్యాలు!"

"బాగా చెప్పేరు. అసలు ఈ కరోనాయే గుండ్రముగా ఏడ్చి చచ్చింది కదండీ. తను సున్నాలాగా ఉండటమే కాదు ప్రపంచాన్ని కూడా సున్నా చుట్టించింది! ఆర్థిక పరిస్థితి, వ్యాపార లావాదేవీలు, బంధుత్వాలు, మానవ సంబంధాలు, ఒకటేవిటి అన్నీ సున్న చుట్టేశాయి!" అన్నాడు ఇంకొకాయన పక్క లైను లోంచి ఆవేశంగా.

****

సాయంత్రం వేళ చెరువు గట్టున కూర్చుని శిష్యుడికి చుట్టలు ఎలా కాల్చాలో శిక్షణ ఇస్తున్నాడు గిరీశం గారు. "రింగులు రింగులు భలే వదుల్తున్నారు సార్" అన్నాడు శిష్యుడు. "ఇవి రింగులు కావురా శిష్యా. ఇరవై లక్షల కోట్లలో సున్నాలు!" అన్నాడు గిరీశం గాల్లోకి ఊదుతూ.

❖❖❖❖❖

## Pride Fruit of India






**Dr. Murali Thiruvengadam**
MBBS, FRACGP

Principal GP, Conjoint Lecturer
Western Sydney University

Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam

RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE

P: (02)88891383 | F: (02)86254326

# Bulk Billing
OPEN 7 DAYS

New Medical Centre at
## Quakers Hill

Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm

G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763

88891383
Fax: 86254326

www.railwayroadmedical.com.au

- డా॥ వై.రామకృష్ణారావు
8985743964

# కొత్తబట్ట

పుట్టి బుద్ధెరిగి
ఎవరో తొడిగిపారేసిన మాసికలచొక్కాలు
పోస్టాఫీసులాగూలు తప్ప
ఓ మూల కూసింత పసుపురాసి
ఫెళఫెళలాడే కొత్త చొక్కా తొడిగి ఎరుగడు!
ఆ మోజు బాల్య కౌమారయౌవనదశల్లో
అతడికి తీరలేదు.
పెళ్ళినాడయినా కొత్తబట్టలా అంటే
ఎదురింటి ఎంకితో లేచిపోయి కాపురంపెట్టిన తనది
దిక్కుమాలిన పెళ్ళి.
సంసారం పెరిగింది
ఉన్న ఊళ్ళో జరుగుబాటులేకకాదు
పట్నంలో పైసలు బాగా సంపాదించుకోవచ్చు
పిల్లగాండ్లని ప్రైవేటుబడిలో చదివించొచ్చు-
పల్లెబాట వదిలిపెట్టాడు
మహానగరంలో రాజమహళ్ళ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీ అయ్యాడు.
ఆకాశసౌధాలు ఆవిర్భవిస్తూనే ఉన్నాయి

పైసలు జమ అవుతూనే ఉన్నాయి
సంసారం, సంతానం అంటూ
అప్పుడూ కొత్తబట్టల ఊసెత్తలేదు.
కాళరాత్రిలా కరోనా కమ్ముకొచ్చింది
చక్రాలు స్తంభించిపోయినై
జీవనరథం నిలిచిపోయింది.
దిక్కుదిక్కునా చీమలబారుల్లా
పల్లెదిక్కుకు కాలినడకన వలసజీవులు
అది అనివార్యమైన 'మారథాన్'
కాలచక్రం మాత్రం ఆగలేదు
కనిపెంచిన ఊరిపొలిమేర కనిపించింది
అల్లంత దూరంలో ఊరి గుడిగోపురం
ఇంధనం లేకుండా యంత్రం ఎంతని నడుస్తుంది?
దేహాన్ని ఇక్కడేవదలి
పొలిమేరలో 'కూలి'పోయాడు
ఆఖరి మజిలీగా మరోలోకానికి వలసపోయాడు
పాడెమీద పడుకోబెట్టి
శుభ్రమైన కొత్తబట్ట కప్పారు
అవును, ఇప్పుడు కప్పింది కొత్తబట్టే!



# వాహిని ఈ మాసపు ప్రశ్నావళి


**'వాహిని'** మాసపత్రికలో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినవారిలో **ఒకరికి Just Cakes** వారిచే $25 విలువ గల Gift Voucher కానుకగా అందించబడుతుంది. సమాధానాలు Vahini@sydneytelugu.org e-mail కు జూన్ 30 వ తేదీలోగా పంపగలరు.

## పద్య పాదంలో మొదటి అక్షరానికి ఏమని పేరు?




**గత మాసపు ప్రశ్నావళి సమాధానాలు:** వాహిని క్విజ్ కు సమాధానం:

**శ్రీమతి జయ రవిచంద్ర, సిడ్నీ - విజేత**


శ్రీ శరత్ చంద్ర

నాకు నచ్చిన సాహిత్యం శరత్ సాహిత్యం. చిన్నతనం లో దాదాపు ఆయన రచనలు అన్నీ చదివాను. ఆయన సాహిత్యం లో దాదాపు ఆశావాదం తక్కువే అని చెప్పాలి. హీరో ఎప్పుడూ బలహీనమైన వ్యక్తి గా, అదృష్ట హీనుడు గా చిత్రీకరిస్తారు. ఉదాహరణ దేవదాసు.

నాకు నచ్చిన నవల శ్రీకాంత్. ఇది భరత వర్ష అనే పత్రికలో ధారవాహికం గా ప్రచురించారు.శ్రీకాంత్ లో స్త్రీల వ్యక్తిత్వాలను గురించి బాగా వర్ణించారు.
శరత్ చంద్ర ఛటర్జీ 15 సెప్టెంబరు 1976 హుగ్లీ జిల్లా దేవానందపూర్ లో జన్మించారు, 16 జనవరి 1938 లో అస్తమించారు.

**శ్రీమతి జానకి వనం, హైద్రాబాద్**

శ్రీమతి జలంధర గారు ప్రముఖ నటుడు శ్రీ చంద్రమోహన్ గారి అర్ధాంగి... ఆమె ఎన్నో కథలు, నవలలు వ్రాసారు... BA (Economics) చదివారు...

ఆమె గృహలక్ష్మి స్వర్ణకంకణం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నుండి ప్రతిభా పురస్కారం పొందారు...

ఆమె, ప్రముఖ రచయిత్రి తెన్నటిలత పేరిట ఏర్పాటు చేసిన వంశీ సాహితి పురస్కారాన్ని అందుకున్నారు...

చంద్రమోహన్ జలంధర దంపతులకు జీవిత సాఫల్య పురస్కారం బహుకరించారు...

ఆమె తెలుగు కళాసమితి పురస్కారాన్ని అందుకున్నారు...

శ్రీమతి జలంధరగారి విరచితమైన 'పున్నాగ పూలు' నవల చదివి అర్థం చేసుకోవటానికి ఈ ఒక్క వాక్యం చాలు...

"Here the patient understands that body heals and not the therapy"...

"ఆకాశంలో విహరిస్తున్న రంగుల గాలి పటం లాంటి పాత్రలను మాంజా దారాలతో దగ్గరగా లాక్కుంటూ" క్లైమాక్స్ పూర్తి చేసాను అని రచయిత్రి శ్రీమతి జలంధర చంద్రమోహన్ గారు తన ముందు మాటలో వివరించారు...

ఈ పుస్తకం చదివిన కొంత మందికి బతకాడానికి, జీవించడానికి తేడా తెలిసింది... ఆలోచించడం... ఎలా ఆలోచిస్తే మా జీవితాలు మెరుగు పడతాయో అర్థమైంది... మనకున్న సమస్యలకు మన ఆలోచనలే కారణం... ఒకే ఆలోచనను, మాటను పునరావృతం చేస్తే మనకు తెలియకుండానే అనుమితం (మనల్ని మనమే శంకించుకునే పరిస్థితి) అయిపోతాము... అది మనకు అంగీకార దిశగా తీసుకు పోతుంది...

మనల్ని మనం తెలుసుకునేలా చేసి, సరైన దిశలో పయనింపచేస్తుంది...

మన బాధలకు కారణం మన మెదడు ఆలోచించే పద్ధతి... అందులో నిరంతరం జరిగే సంఘర్షణ మన మెదడుని సన్యసింప చేయగలిగితే సర్వం మన నియంత్రణలో ఉన్నట్లే...

"కష్టాలు, పరీక్షలు, నిరాశ, నిస్పృహలు ఇవన్నీ కూడా మన మీద మనకు నమ్మకం లేకపోవడం వలన సంభవించే సంగతులు...

నవలలో 'డా. జి కె హీలింగ్ సెంటర్' - ఈ వైద్యశాలలోని వాతావరణం, అక్కడి వైద్యుల చికిత్సా విధానం, చాలా క్రొత్తగా చెప్పారు రచయిత్రిగారు... ఇలాంటి వైద్యశాల నిజంగా ఉంటే బాగుండు అని అనిపిస్తుంది... రక రకాల మనస్తత్వాలను చూసిన నవలలోని నాయిక రాధ అంతిమంగా తీసుకున్న

నిర్ణయం, మనల్ని ఆలోచింపచేస్తుంది... కొన్ని సమస్యలకు పరిష్కారం దొరకవు... ఈ 'పున్నాగ పూలు' నవల మన మెదడును పదును పెట్టి దిశా నిర్దేశం చేస్తుంది...

నేను శ్రీమతి జలంధరగారిని ముఖాముఖి కలిసినప్పుడు, ఈ పుస్తకం చదివిన నేను ఇలాంటి హీలింగ్ హాస్పిటల్స్ ఎక్కడనా ఉన్నాయా అని అడిగాను... అందుకు ఆవిడ తను ఎక్కడో చదివిన అంశం, తనకొచ్చిన ఆలోచనతో ఈ నవల రూపు దిద్దుకున్నట్లు చెప్పారు... చాలా మంది తమకు హాస్పిటల్ అడ్రెస్ కావాలని అడిగారని చెప్పారు...

రచయిత్రిగారికి వచ్చిన ఒక ఊహకు నిజ రూపమిస్తే ఎంత బాగుంటుందో ఈ నవల మనకు తెలిపింది... ప్రతి ఒక్కరు చదవాల్సిన పుస్తకం 'పున్నాగపూలు'... ఎంతో అపురూపమైనది... మిస్సవకండి...



**శ్రీమతి జలంధర**

❖❖❖❖❖

SoftLabs® Demands Delivered
IT CONSULTING SERVICES COMPANY
TRAINING SERVICES
- SOFTWARE TESTING
- PRE SALES ANALYSIS
- BUSINESS ANALYSIS
- AGILE TRAINING
CONSULTING SERVICES
- CONTRACT MANAGEMENT
- PAYROLL MANAGEMENT
- RESOURCE MANAGEMENT
- STAFFING
CONTACT : SREENI PILLAMARRI P: 0410 756 040 | E :BUSINESS@SOFTLABS.COM.AU | W: WWW.SOFTLABS.COM.AU
SYDNEY | MELBOURNE | CANBERRA | ADELAIDE | BRISBANE | PERTH | TASMANIA

# కరోనా పాఠాలు

**శ్రీమతి విజయ చావలి, సిడ్నీ**



**కా**లం ఆగలేదు కాని
భావం మారింది మనిషిలో
తన పొరుగు కూడా బాగుండాలని

**వే**గం తగ్గలేదు కాని
త్యాగం పెరిగింది మనిషిలో
ఎదుటి వారికి తొలగి దారియివ్వాలని

**భో**గం పొందలేదు కాని
రోగం రాకూడదని మనిషికి
వున్న చోటే సుఖం వెదుక్కోవాలని

**భా**గ్యాలు వద్దులే కాని
బతికుంటే చాలులే అని మనిషికి
చావు బతుకుల మధ్య గీత తెలుస్తోందని

**బ**యట తిరిగి తినడం తగ్గి
యింటి వంట మధురమని యిక మనిషికి
మమకారపు రుచి కమ్మగా వుందని

**ప**రదేశమెంతో గొప్పనుకున్నారు కాని
తన సంస్కృతి విలువ మనిషికి
నమస్కారం తన పద్ధతేనని చాటి చెప్పాలని

**హ**డావిడి శబ్దాల హోరు లేదు కాని
మౌన నిశబ్దంలో అందముందని మనిషికి
ధ్వని కాలుష్య రహిత ప్రకృతి శోభ తెలుస్తోందని

**భౌ**తిక కలయిక లేదని
మనుగడకి బలం మంచి మాటని యిక మనిషికి
మాట వినిపించి మమత తెలు పొచ్చని

**దే**వుడి కోసం గుడికే వెళ్ళనక్కరలేదని
మనసులోనే గుడి వుందని మనిషికి
తదేక ధ్యానంతో దేవుడ్ని చూడొచ్చని

**మ**డి చాదస్తాలని విసుక్కు న్నారు కాని
ఆలోచిస్తే పరమార్ధాలున్నయని మనిషికి
తన శుభ్రతే తన రక్షని

**ఖా**ళీ లేదు అభిరుచులకంటూ
సాకులు వెదకే మనిషికి
దొరికిన నిశ్శబ్ద ఏకాంతంలో మునిగి పోవచ్చని

**గు**రువుల బాబాల బోధ వెళ్లలేక పోతు న్నాననే వారికి
రోగాల నివారణ కాని అభయ మిచ్చేది కాని
వైద్యుడే దేవుడ్ని నిజం బోధపడుతోందని

**మ**ద్యం లాటి బలహీనత కంటే బతకడం ముఖ్యమని

**కు**టుంబ సభ్యుల సహజీవనం కంటే టీవి సీరియల్ గొప్పెం కాదని

**పో**రాట పటిమలో పేరెన్నిక గన్న మనం
చిన్న క్రిమికి వెన్ను చూపి పారుగుతామా?

**ఎ**వరిని కదిపినా
ఏది చదివినా
నేర్పుతోంది జీవిత పాఠం
బోధిస్తోంది వేదాంత సారం.

**ఒ**క్కటై నిలిచి కరోనాని గెలుద్దాం

**ఒ**క్క లక్ష్యంతో కరోనాని తరిమేద్దాం

❖❖❖❖❖



**INDAUS Celebrating 15 years of excellence**

We Provide Services Related To:

- General Skilled Migration Visas
- Family Visas
- Employer Based - Skilled Visas
- Long Term Business Visas
- Visitor Visas
- Student Services and Visas
- MRT - Migration Review Tribunal

## INDAUS IMMIGRATION

Home to all your migration needs...

**You enroll for professional year through us and we do 485 Visa for FREE**

**Good Scholarships & discounts for professional year program**

**Want to Know More Call Sree on 0416 799 306**

**What we do for Students**

**Student Visa Extensions**

**University & Course Change**

**Temporary Visas ( Post Study Work)**

***Sydney (Branch Office)***

Strathfield Plaza
Suite 7, Level 7, 11 The Boulevard
Strathfield NSW - 2135

***Melbourne (HQ)***

Suite 14, Level 11
401 Docklands Drive
Docklands VIC 3008

***Hyderabad, India***

Office
F.No. 303, Star G.B.R P.R.K. Enclave,
Dharam Karam Road, Ameerpet,
Hyderabad 500016 INDIA

Phone: +91 72070 44933

www.indausimmigration.com **Call 1300 699 306** info@indausimmigration.com

# వాహిని పాఠకుల స్పందన

మే నెల వాహిని 'ఈ మాసపు ప్రశ్నావళి'లో నాకు బహుమతి ప్రకటించినందుకు ముందుగా నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను...

మాటలు సమర్థవంతంగా వాడుకోవటంలో మనిషి వ్యక్తిత్వమే కాదు మానసిక ప్రశాంతత కూడా దొరుకుతుంది... నిజమే... ఎవరికి నచ్చిన రీతిలో వారు స్పందిస్తేనే ఏదైనా ఆవిర్భవిస్తుంది... మానవ జీవితం సార్థకత గురించి సంపాదకులు విజయగారు తమ సంపాదకీయంలో అద్భుతంగా చెప్పారు... కరోనా పై జరుగుతున్న పోరులో మానవలోకం విజయం సాదించాలనే మీ కోరిక నెరవేరాలని ఆశిద్దాం...

భగవద్గీతలో దుర్బుద్ధి దృతరాష్ట్రుడిదా? లేక దుర్యోధనుడిదా? పెయ్యేటి రంగారావుగారు మంచి వివరణ ఇచ్చారు... నేరం చేసినవారే కాదు, ఆ నేరానికి సహకరించినవారు కూడా నేరస్థులే... నేటి సమాజానికి గీతలోని ఈ అంశం చక్కగా సరిపోతుంది...

ఆయుర్వేదం – కరోనా వ్యాధి చాలా ఉపయోగకరంగా ఉంది... ఎన్నెన్నో మధుర స్మృతులు పంచుకున్న కరోనా కరుణ బాగుంది...

సరసిగారి కార్టూన్లు, జోకులు వాహినికి ఒక ప్రత్యేకతను తీసుకొచ్చాయి...

పెయ్యేటి శ్రీదేవిగారి 'భైరవీయం' నవ్వులు పెదజల్లింది... వాహిని హాస్యపు జల్లులు బాగా కురిపిస్తోంది...

'యుద్ధం' అంటే ఏమిటో రామకృష్ణారావుగారు బాగా చెప్పారు... నిజంగా దేవుడు ప్రత్యక్షం అయినా నమ్మలేని విధంగా మన మనసులో కొలువైవున్న రామారావు గారి గురించి బాగా వ్రాసారు...

ఇన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నా'అమరావతి' 'భ్రమరావతి' యేనా? వంగూరి చిట్టెన్ రాజుగారి కథనం బాగుంది... వెరసి ఈ నెల వాహిని రంగుల హరివిల్లుగా మెఱుగులు పులుముకొంది...

**శ్రీమతి షామీరు జానకీ దేవి, హైదరాబాదు**

విజయగారు..నమస్తే. వాహిని పంపినందుకు, నాకవిత ప్రచురించినందుకు ధన్యవాదాలు. మీ శ్రద్ధ, కృషి ప్రశంసనీయం.

వాహిని మే నెల సంచిక సర్వాంగ సుందరంగా ఉంది. ఆధ్యాత్మికత, ఆరోగ్యం, హాస్యవినోదం, సంగీతం, మన తెలుగు భాష ఉచ్చారణ,లేఖనవైశిష్ట్యం..వాస్తవికతకు దర్పణం పట్టే కరోనాకవితలతో రంగులీనే హరివిల్లు వాహిని. భద్రపరుచుకోదగిన విలువైన సంచిక.

**-వై(ఎల్లాప్రెగడ) రామకృష్ణారావు, సిడ్నీ**

. ❖❖❖❖❖

ARA VAULTS

SAFE DEPOSIT BOXES

SECURE YOUR VALUABLES

BULLION JEWELLERY DOCUMENTS DATA CURRENCY

WESTERN SYDNEY'S

# MOST SECURE SAFE DEPOSIT BOXES

**OWNED & OPERATED BY INDUSTRY EXPERTS**

Our private, state-of-the-art vault is equipped with multiple layers of advanced electronic security, providing our members with both world-class security and peace of mind. Visit ARA Vaults today to learn how we can provide the most secure storage for your valuables.



**PH: 02 8326 7907**

aravaults.com.au

# సంగీత నాదామృతం

డా. పద్మ మల్లెల, సిడ్నీ



ఇక ఇప్పుడు తాళదశ ప్రాణాలలో తరువాతది అయిన జాతి ప్రాణం గురించి తెలుసు కుందాం. క్రొత్త సంగీత విద్యాదర్పణం అనే ఏకా సుబ్బారావు గారిచే రచింపబడిన గ్రంథంలో ఈ క్రింది విధంగా పేర్కొన బడి ఉంది.

"అనుగాయా మతేర్ధర్మం కారణం జాతిరుచ్యతే"

అనగా మనుష్యులలో వివిధ జాతులవారు ఎలా ఉన్నారో తాళానికి సంబంధించి కూడా జాతి అనేది చాలా సహజమైన విషయం కనుక దీని గురించి చర్చించు కుందాం.

" చతురశ్ర తిశ్ర మిశ్రా ఖండ సంకీర్ణక స్తథా
పంచధా జాతయ స్సర్వే తత్స్వరూపం నిరూప్యతే"

చతుర్ముఖుడైన బ్రహ్మను సూచిస్తూ ముందుగా చతురశ్ర జాతి ఏర్పరచ బడింది. ఈ 4 ను త్రిగుణం చేయగా 12 ను, మరియు ఈ 12 ను మరల నాలుగు భాగాలు చేయగా వచ్చేది తిశ్ర జాతి మరల ఈ రెండు జాతుల అక్షర కాలాలను కలపగా 7 అక్షర కాలాలు కల మిశ్ర జాతి లఘువు ఏర్పడ్డాయి.

ఇక ఈ తిశ్ర మరియు మిశ్ర జాతి కలపగా వచ్చే 10 ని సగం చేయగా వచ్చే 5 అక్షరకాలాలు ఖండ జాతిగా ఏర్పరచ బడింది. ఇక ఈ ఖండ జాతిని చతురశ్ర జాతికి గల అక్షర కాలాలను కలపగా వచ్చే 9 అక్షరకాలాలను సంకీర్ణ జాతిగా ఏర్పరచారు. ఇక ఇక్కడ ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే ఈ జాతి ప్రాణం లఘువు అనే తాళాంగానికి మాత్రమే వర్తిస్తుంది.ఇక ఈ లఘు జాతి ఆధారంగా సంగీతం అధ్యయనంలో అతి ముఖ్యమైన సప్త తాళ అలంకారాలు ఏర్పరచ బడ్డాయి.తద్వారా 35 తాళాలు ఏర్పడ్డాయి.

తరువాత తాళ దశ ప్రాణాలలో తెలుసుకోవలసినది లయ ప్రాణం. దీనికి సంబంధించిన శ్లోకం ఈ క్రింది విధంగా ఉంది.

" తాళాంతరాళ వర్తీయః కాలోऽసౌలయ నామకః
ధ్రుత మధ్య విళంబాశ్చ భవేయుస్త్రీ విభాలయః
ధ్రుతమధ్యో విళంబశ్చ ధ్రుత శీఘ్ర తమోమతః
ద్విగుణా ద్విగుణోజ్ఞేయౌ తస్మాన్మధ్య విళంబితా"



తాళంలోని క్రియల మధ్య ఉండే గమనాన్ని (tempo) లయ అని పేర్కొనబడింది. ఇది సాధారణంగా 3 రకాలు. ఒకటి ధృతలయ అంటే చాలా దురిత(high speed tempo) మధ్య లయ అనగా medium tempoమరియు విలంబలయ అంటే slow tempo. ఇవే కాకుండా వేరే విభజన ప్రకారం

9 రకాల లయలు ఉన్నాయి. విలంబ విలంబ, విలంబ మధ్య, విలంబ ధృత, మధ్య విలంబ, మధ్య మధ్య, మధ్య ధృత, ధృత విలంబ, ధృత మధ్య మరియు ధృత ధృత. ఇక ఒక రచనలో ఒక లయలో మొదలు పెడితే ఆసాంతం ఆ లయను అనుసరించ వలసి ఉంటుంది. ఇక సంగీత రచనలలో చూస్తే గీతములు ధృత లయలోను, కీర్తనలు మరియు వర్ణములు మధ్య లయ ఇక విలంబ కాల కృతులు విలంబ లయలో ఉంటాయి.

తాళ దశ ప్రాణాలలో తరువాతది యతిప్రాణం. దీని శ్లోకం ఈక్రింద విధంగా ఉంది.

" లయప్రవృత్తి నియమో యతిరిత్యదీయతే
సమ స్రోతోవహాఖ్యాతా గోపుచ్ఛేక పిపీలికా
మృదంగికాచ విషమో షడ్విధా యతి రుచ్యతే"

అనగా ఒక తాళంలో లయ యొక్క నిర్దేశానికి సంబంధించిన నియమాలను తెలియ చెప్పేది యతిప్రాణం గా చెప్పబడుతుంది.ఇంకా వివరంగా చెప్పాలంటే ఒక తాళంలో స్వరాల లేక జతుల అమరికను తెలియ చెప్తుందన్న మాట.ఇది 6 రకాలు. సమ యతి, స్రోతోవహ యతి, గోపుచ్ఛ యతి, మృదంగయతి, డమరుయతి మరియు విషమ యతి. ఇప్పుడుఈ యతుల గురించి విపులంగా తెలుసుకుందాం.

మొదటగా సమ యతి అంటే ఒక తాళంలో జతులు స్వరాల కూర్పు ఎటువంటి వక్రగతి లేక ఒక సరళ రేఖ(straight line)లాగా నడుస్తుంది.ఇది చీమలబారును పోలి ఉంటుంది కనుక దీనిని పిపీలిక యతి అని కూడా అంటారు. ఉదాహరణకు:

1234567

రెండవది స్రోతోవహ యతి. స్రోతోవహము అంటే నది అంటే river. కనుక ఒక నది ఎలాగయితే ఆరంభంలో చిన్నగా ఉండి పోను పోనూ ఎలా వెడల్పుగా పెరుగుతుందో ఈ జగతిలో స్వర లేక జాతి గమనం ముందు చిన్నగా ఉండి పోను పోను వెడల్పుగా ఉంటుంది. ఉదాహరణకి

1

123

1234

తరువాత క్రమంలో వచ్చేది గోపుఛ్ఛ యతి అంటే స్వరాల లేక రచనకూర్పు ఆవుతోక లాగా మొదట వెడల్పుగా ఉండి క్రమేపి సన్నగా ఉంటుంది. ఒక రకంగా మనం పైన చెప్పుకున్న స్రోతోవహ యతి కి వ్యతిరేక దశలో ఉంటుంది. ఈ క్రింది విధంగా అన్నమాట.

1234

123

12

వరుస క్రమంలో తరువాతది మృదంగ యతి అనగా దీని కూర్పు సంగీత వాయిద్యం మృదంగంలాగా మధ్యలో వెడల్పుగా కొసలలో చిన్నగా ఉంటుంది. ఉదాహరణకి ఈ క్రింది విధంగా:

1

123

12345

123

1

క్రమంలో తరువాతది డమరు యతి అంటే ఇందులో కూర్పు శివుని యొక్క డమరుకాన్ని పోలి ఉంటుంది.ఇంకా వివరంగా చెప్పాలంటే మొదట వెడల్పుగా ఉండి మధ్యలో సన్నగా ఉండి తిరిగి వెడల్పుగా అవుతుంది. అంటే ఈ క్రంది విధంగా అన్నమాట:

1 2 3 4

2 3

2

2 3

1 2 3 4

ఇక చివరగా విషమ యతి అంటే కూర్పు ఒక క్రమం లేకుండా సాగుతుంది. ఉదాహరణకి

1 3

2 4

5

లా అన్నమాట.

ఇక తాళ దశ ప్రాణాలలో చివరిది ప్రస్తార ప్రాణం. ఒక తాళంలో అంగముల యొక్క విస్తరణను ప్రస్తార ప్రాణంగా చెప్పుకోవచ్చు. ప్రాచీనంగా దీనిలో ఉన్నది చతురంగ ప్రస్తారము, షడంగ ప్రస్తారము, షోడశంగ ప్రస్తారము, లఘు మేరు, ధృత మేరు, ప్లుత మేరు మొదలయినవి. కాని ప్రస్తుత కాలంలో ఇవి వాడుకలో లేవు. కాని కొంతవరకు వాడుక లో ఉన్న ప్రస్తారం ఈ క్రింది విధంగా ఉంటుంది. ఉదాహరణకి ఒక చతురశ్ర జాతి లఘువు ని తీసుకుంటే ఈ క్రింది విధంగా చెయ్యొచ్చు.

1–

1+ 2+1

3+1, 1+1+2, 2+1+1, 1+1+1+1 మొదలయినవి. అంటే నాలుగు అక్షరాల కాలాన్ని పైన పేర్కొన్న చాలా రకాలుగా విభజన చేసుకున స్వర ప్రస్తారం చేయ వచ్చునని మాట. ఒక రకంగా మన గణిత శాస్త్రం లోని permutations and combinations అనే విషయానికి కొంత వరకూ సరి పోలుతుందన్న మాట.

ఈ ప్రస్తార ప్రాణ ప్రకరణ తో తాళదశ ప్రాణాలు అనే అంశం ముగుస్తుంది.

ఇక మనం ముచ్చటించుకొనే త్యాగరాజ కీర్తనల పరంపర లో హరికాంభోజి రాగంలోని ఒక మాట ఒక బాణము అనే కీర్తనను ప్రస్తావించుకుందాం. ముందు కీర్తన:

పల్లవి:

ఒకమాట ఒక బాణము ఒక పత్నీవ్రతుడే మనసా

అనుపల్లవి:

ఒక చిత్తము గల వాడే ఒక నాడును మరువకవే

చరణము:

స్థిర జీవిత్వము నిర్జర వర సౌఖ్య మొసంగేసే

ధర బరగే దేవుడే వర త్యాగరాజ నుతుడే

ఈ కీర్తన త్యాగరాజ రామ భక్తికి తార్కాణం. చక్కని సులభ మైన శైలిలో సంగీతంలో ప్రారంభ దశ లో ఉన్నవారికి నేర్చుకొన గలిగే చక్కని రచన. పిల్లలకు రాముని యొక్క గుణబోధన చేసే కీర్తన. చక్కని విద్యా బోధన కల కీర్తన అని మీరందర నాతో ఏకీభవిస్తారని ఆశిస్తూ సెలవు.

సంగీత విద్వాన్ శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు ఆలపించిన ఈ కీర్తన క్రింద లంకెద్వారా విని ఆనందించండి.

https://www.youtube.com/watch?v=EPcTDf7OGrw

❖❖❖❖❖


SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145

# అంతర్జాతీయ యోగా దినోత్సవం

శ్రీ మధు బైరెడ్డి,సిడ్నీ

ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21 తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటారు. అసలు యోగా అంటే ఏమిటి? దీన్ని మానసిక ఉల్లాసంగా పేర్కొనవచ్చు. ప్రాణాయామం, ధ్యానం మరియు యోగాసనాల సాధన ద్వారా శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం మరియు ఆధ్యాత్మిక ప్రశాంతత చేకూరుతుంది. ఇంకా యోగా పరిశోధనల ప్రకారం, మానసిక ఆందోళన, ఉబ్బసం, కీళ్ళనొప్పులు, రక్తపీడనం, చక్కర వ్యాధి, గుండె జబ్బులు, తలనొప్పి మొదలైన ఎన్నో శారీరక రుగ్మతలను యోగ  సాధన ద్వారా తగ్గించవచ్చని తెలుస్తోంది.

There is more to it:

- Yoga improves muscle tone, flexibility, strength and stamina
- Reduces stress and tension
- Boosts self esteem
- Improves concentration and creativity
- Lowers fat and improves blood circulation
- Stimulates the immune system
- Creates a sense of well-being and calm

ఇందులో నాకు నచ్చినవి మరియు నాకు బాగా ఉపయోగపడుతున్నవి సూర్య నమస్కారాలు. ఇది మొత్తం పది ఆసనాలతో కూడుకున్న ప్రక్రియ. మన శరీర భాగాలన్నింటికి సంకోచ వ్యాకోచ ప్రక్రియ ఈ సూర్య నమస్కారాలు. దీన్నే సర్వాంగ సుందర వ్యాయామం అని చెప్పుకోవచ్చు.  దీని ఉపయోగాలు:

- Beneficial for lymphatic system, enhance immunity
- Increase strength and vigor
- Flexibility of back muscles and spine
- Legs, arms, wrists, ankles and calf muscles get strong

సూర్య నమస్కారాల వరుస క్రమం ఈ క్రింది విధంగా ఉంటుంది:

| | | | |
|---|---|---|---|
| నమస్కారం | ఊర్ధ్వ నమస్కారం | జానుశిరాసన | ఏకపాద ప్రసరన |
| ద్విపాద ప్రసరన | అష్టాంగ నమస్కారం | భుజంగాసనం | భుధరాసనం |
| ఏకపాద ఆకర్షన | ద్విపాద ఆకర్షన | ఊర్ధ్వ నమస్కారం | నమస్కారం |




❖❖❖❖❖

# BRAND NEW MELBOURNE CBD & SOUTHBANK APARTMENTS

**1, 2 & 3 beds from $489,000* (Off-the-plan)**




Walk to Melbourne city centre, Arts Precinct, shopping, cafes, restaurants, parks, transport & more.

Easy Access to RMIT & Melbourne University.

Exclusive resident facilities: Indoor pool, gym, terrace courtyard, BBQ, concierge & more.

✔ **Low Owners Corporation Fees (Strata Fees)**

BUY DIRECT *from* AUSTRALIAN OWNED DEVELOPER

**INSPECT IN SYDNEY OFFICE BY APPOINTMENT:**

**299 Elizabeth Street, Sydney**

**1800 44 55 20**

Multilingual staff available, many Indian languages spoken

**centralequity.com.au**

CENTRAL EQUITY 30TH YEAR CELEBRATION

AWARD WINNING MELBOURNE DEVELOPER

*OVER 75 PROJECTS DELIVERED AS PROMISED*

*Price as at 28/6/2018 until sold.

# మా విశ్వనాథం మాస్టారు

విన్నకోట దుర్గ, హైద్రాబాద్



లలిత సంగీత విద్వన్మణి శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారి 101వ జయంతిని పురస్కరించుకొని నా హృదయ స్పందన...

ఇంతింతని పొగడలేని ఘనతరము

ఆ నామము

ఎంత పాడినను తరగదు కృష్ణ సన్నుతుని లీలలు అన్న ఒక కవి యొక్క మాటలు గుర్తుకు వస్తాయి మనందరికీ విశ్వనాథం మాస్టర్ ని తలుచుకుంటే. ఎందుకంటే ఎంతని పొగడగలము

ఆ విశ్వనాధుని,ఎంత పాడినను తరగవు విశ్వనాధుని పాటలు అన్న మాట నిజం కదూ. సమ్మోహనంగా

తన వీణావాణిని వినిపించినా, ప్రసన్న వదనంతో ఆహ్లాదకరమైన చూపులతో, నిండైన విగ్రహంతో, శ్వేత వస్త్రధారణతో, కళకళలాడుతూ కనిపించే

**శ్రీ పాలగుమ్మి విశ్వనాథం** గారి విద్వత్తును ఏమని శ్లాఘించగలం. వారి గాత్రంలోని మాధుర్యాన్ని ఏమని చెప్పగలం. ఎంత పొగిడినా తరగదు. మనందరినీ పంటచేల గట్లమీద తిప్పాలన్నా, పల్లె శోభల్ని మన మనోఫలకంపై ఆవిష్కరింప చేయాలన్నా , నేటి నుండి ఏనాటికి వీటి తలుపు మూయకు అని ఒక గృహస్థు ఎలా ఉండాలి అనే సాహిత్యాన్ని రాయాలన్నా ,వెనుక ఎవరో నిలిచినట్లులై వీపు మెల్లగ నిమిరినటులై అన్న వాణికి బాణి సమకూర్చాలన్నా, ప్రకృతి శోభ లన్ని కళ్ళకి కట్టినట్లు చూపించాలన్నా, దేశభక్తి గీతాలతో గుండె ధైర్యం నింపాలన్నా, జానపద బాణీలను సమకూర్చాలన్నా వారికి వారే సాటి. అపరిమితమైన స్వర బాణీలు కట్టడము వారికే సాధ్యం .ఏ పాటకి ఎంత సారం ఉండాలి ఏ పాటకి ఏ బాణి సమతూకంగా కుదురుతుందో అట్టి విధంగా సమకూర్చే గలిగే సామర్థ్యం ఉన్నవారు శ్రీ విశ్వనాథం మాస్టారు. అందమైన సాహిత్యానికి స్పష్టమైన రాగాలను కూర్చగలిగే వాగ్గేయకారులు శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారు. వేలాది లలిత గీతాలకు మధురాతి మధురమైన బాణీలను కూర్చి, మరెన్నో అద్భుతమైన గీతాలను రచించి, ఆణిముత్యాల వంటి ఎన్నెన్నో లలిత గీతాలను స్వయంగా గానం చేసి, తెలుగు వారికి సగర్వ వారసత్వ సంపదను మిగిల్చిన గురువులు *శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారు స్వతస్సిద్ధగాత్రులు.

'నా ట్యూన్,నేను చేసిన ట్యూన్ ఇలాగే పాడాలి' అని నియమ నిబంధనలు విధించని మరియు  జనరంజకంగా పాడడం   మీఅందరి విధి అంటూ మీరందరూ  అనుకుని ఒకలాగా' పాడుకోండర్రా'అని లాలనగా చెప్పే గురువుగారు ఎంతటి మేధావి కదా. మరి వారి బాణీలు ఇంత బాగా ప్రాచుర్యం పొందాయి అంటే దానికి కారణం ఏమిటో  మన అందరికీ ఇప్పటికి అర్థమయ్యే ఉంటుంది. ఒక మాటలో చెప్పాలంటే వారి పాటలు షడ్రసోపేతమైన ఒక విందు భోజనం అన్న మాట.

వారి ఇల్లు ఒక ఒక పుస్తక భాండాగారం.పాత విషయాలన్నీ గుర్తుపెట్టుకుని మరి మాకు విశదపరిచే వారు. వారు అందరినీ ఆప్యాయంగా పలకరించేవారు సంగీత మిత్రులందరినీ పలకరించేవారు.

ఎల్లప్పుడూ నూతనోత్సాహంతో ఉండేవారు.

ఎంత తక్కువ పరిచయం ఉన్న వాళ్లేనా  వారిని 'మాస్టారూ 'అని సంబోధించాలి అనిపిస్తుంది యాఅల్లా,శుభానల్లా,భళా వంటి పడికట్టు పదాలు వారి రచనలలో మనకు గోచరిస్తాయి మరియు  ఓ హో హో, ఆ హా హా అనే ఆహ్లాదకరమైన స్వర మధురిమలు మనకు  ఆనందాన్ని కలిగిస్తాయి. వారి యొక్క బాణీలను అనేకమంది విశిష్ట గాయనీగాయకుల తోటి పాడించి లలిత సంగీతం యొక్క గొప్పదనాన్ని చాటిచెప్పిన మహనీయులు శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారు.

జీవితాన్ని సంపూర్ణంగా అన్ని విధాల ఆస్వాదించిన శ్రీ విశ్వనాథ మాస్టారు మన మధ్య లేరు అనుకుంటే సంగీత ప్రియులందరికీ  హృదయం భారం అవుతుంది . ఏ దూర తీరాలలో ఉన్నా

వారి యొక్క ప్రేమ, ఆప్యాయత మన వెంటే నిరంతరం ఉంటుంది.

వి కె దుర్గ(విన్నకోట దుర్గ)

ఆకాశవాణి , దూరదర్శన్

గ్రేడెడ్ గాయని మరియు రచయిత.

హైదరాబాద్.

హృదయాన్ని కదిలించే ఈ మధుర లలిగ గీతం 'ఒక్కసారి మా ఊరు పోయి రావాలి' శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారి గళంలో ఈ లింకు ద్వారా విని ఆస్వాదించండి.

https://www.youtube.com/watch?v=hXr9B4R9gWo&list=RDhXr9B4R9gWo&start_radio=1&t=11

❖❖❖❖❖

మన సిడ్నీవారి తెలుగు వాహిని రెండవ సాహితీసదస్సు నిర్వహించనున్నాము. మన వాహిని మాసపత్రికకు రచనలు పంపుతున్న రచయితలు, ప్రోత్సాహకులు పరోక్షంగా అంతర్జాలంలో దేశావిదేశాల నుండి సాహితీ సరస్వతులు  కొలువుతీరనున్నారు. సాహిత్యపిపాసకులు, తెలుగు భాషాభిమానులు ఈ కార్యక్రమానికి హజరై జయప్రదం చేయగలరని భావిస్తున్నాము.

వాహినీ సాహితీసదస్సుకై నమోదుచేసుకోండి హాజరుకాదలచినవారు, ఉపన్యాసం ఇవ్వాలనుకునేవారు ఈ మెయిల్ ద్వారా సంప్రదించండి vahini@sydneytelugu.org or Vijaya Gollapudi on 0438293687.



❖❖❖❖❖



# కామేశ్వరి



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra times are finishing and Varjyam times are start to finish - Standard or Daylight Saving Time (AEST/NZDT) as applicable in Australia.

## జూన్ 2020

శ్రీ శార్వరి జ్యేష్ఠ శు దశమి నుండి ఆషాఢ శు నవమి వరకు

శు – శుద్ధ; బ – బహుళ; వ – వర్జ్యం; పూ – పూర్వ; ఉ – ఉత్తర; రా - రాహు కాలం; పూర్తి అనగా తిధి/నక్షత్రం 00:00 నుండి మరుసటి రోజు 00:00 గంటల వరకు - 24 గంటల వ్యాప్తి. ఆస్ట్రేలియా లోని సిడ్నీ మెల్బోర్న్ కాల మానాలకు వర్తిస్తుంది.

పంచాంగ కర్తలు: నేతి శివరామకృష్ణ శాస్త్రి (సిడ్నీ) & కర్రా భాస్కర శర్మ (మెల్బోర్న్)

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆది<br>రా - 16:30 to 18:30 | Festivals & Holidays<br>01 – Queens Birthday | 7<br>బ పాడ్యమి 2:58<br>మూల 18:38<br>వ 17:7 - 18:39 | 14<br>బ అష్టమి 5:24<br>పూర్వాభాద్ర 2:0<br>వ 12:44 - 14:31 | 21●<br>బ అమావాస్య 16:36<br>మృగశిర 17:32<br>వర్జ్యం లేదు | 28<br>శు సప్తమి 7:15<br>ఉత్తర 13:16<br>వ 21:8 - 22:38 |
| సోమ<br>రా - 7:30 to 9:30 | 1 జ్యేష్ఠ<br>శు దశమి 19:20<br>ఉత్తర 7:33<br>హస్త 5:31<br>వ 6:50 - 6:42<br>వ 13:55 - 15:31 | 8<br>బ విదియ 1:19<br>పూర్వాషాఢ 18:12<br>వ 4:4 - 5:38 | 15<br>బ నవమి 7:43<br>ఉత్తరాభాద్ర 4:50<br>వ 18:19 - 20: 7 | 22 ఆషాఢ<br>శు పాడ్యమి 16:30<br>ఆరుద్ర 18:5<br>వ 2:7 - 3:46 | 29<br>శు అష్టమి 4:59<br>హస్త 11:43<br>వ 19:11 - 20:41 |
| మంగళ<br>రా - 15:00 to 16:30 | 2<br>శు ఏకాదశి 16:30<br>హస్త 5:31<br>వ 12:48 - 14:15 | 9<br>బ తదియ 0:23<br>ఉత్తరాషాఢ 18:32<br>వ 2:19 - 3:56<br>వ 22:42 - 0:22 | 16<br>బ దశమి 10:6<br>రేవతి 7:49<br>వర్జ్యం లేదు | 23<br>శు విదియ 15:50<br>పునర్వసు 18:4<br>వ 6:4 - 7:40 | 30 ఆషాఢ<br>శు నవమి 2:39<br>చిత్ర 10:7<br>వ 15:22 - 16:52 |
| బుధ<br>రా - 12:00 to 13:30 | 3<br>శు ద్వాదశి 13:28<br>చిత్ర 3:20<br>వ 8:27 - 9:54 | 10<br>బ చవితి 0: 6<br>శ్రవణం 19:29<br>వ 23:45 - 1:27 | 17<br>బ ఏకాదశి 12:17<br>అశ్విని 10:33<br>వ 6:6 - 7:53<br>వ 21: 7 - 22:53 | 24<br>శు తదియ 14:40<br>పుష్యమి 17:37<br>వ 1:55 - 3:29 | |
| లక్ష్మి<br>రా - 13:30 to 15:00 | 4<br>శు త్రయోదశి 10:32<br>స్వాతి 1:13<br>విశాఖ 23:5<br>వ 6:19 - 7:47 | 11<br>బ పంచమి 0:29<br>ధనిష్ఠ 21:6<br>వర్జ్యం లేదు | 18<br>బ ద్వాదశి 14:4<br>భరణి 12:58<br>వర్జ్యం లేదు | 25<br>శు చవితి 13:9<br>ఆశ్లేష 16:57<br>వ 6:4 - 7:37 | School Holidays<br>Vic: 27 Jun – 12 Jul |
| శుక్ర<br>రా - 10:30 to 12:00 | 5●<br>శు చతుర్దశి 7:39<br>అనురాధ 21:9<br>వ 2:46 - 4:14 | 12<br>బ షష్ఠి 1:36<br>శతభిషం23:24<br>వ 4:59 - 6:44 | 19<br>బ త్రయోదశి 15:26<br>కృత్తిక 15:4<br>వ 2:1 - 3:45 | 26<br>శు పంచమి 11:30<br>మఖ 15:53<br>వ 4:25 - 5:57<br>వ 23:28 - 0:59 | Sydney<br>Sun Rise Set<br>1 6:52 16:53<br>8 6:56 16:52<br>15 6:59 16:52<br>22 7:01 16:53<br>29 7:01 16:55 |
| శని<br>రా - 09:00 to 10:30 | 6<br>శు పూర్ణిమ 5:7<br>జ్యేష్ఠ 19:42<br>వ 2:25 - 3:55 | 13<br>బ సప్తమి 3:22<br>పూర్వాభాద్ర పూర్తి<br>వ 6:30 - 8:16 | 20<br>బ చతుర్దశి 16:19<br>రోహిణి 16:34<br>వ 8:4 - 9:46<br>వ 22:23 - 0:3 | 27<br>శు షష్ఠి 9:31<br>పుబ్బ 14:36<br>వ 21:24 - 22:55 | Melbourne<br>Sun Rise Set<br>1 7:27 17:08<br>8 7:31 17:06<br>15 7:34 17:06<br>22 7:36 17:07<br>29 7:37 17:09 |

satyanarayanam devam sukla varnam chaturbhujam |
sankha chakra gada padma vanamala vibhushitam ||

# పాట నేర్చుకుందామా/పాడుకుందామా

**చిత్రం: స్వాతికిరణం**

**సంగీతం: శ్రీ కె.వి .మహాదేవన్**

**సాహిత్యం: శ్రీ సి. నారాయణ రెడ్డి**

**గానం: శ్రీ ఎస్.పిబాలసుబ్రహ్మణ్యం**

స......రిగమపదనిస......నిదపమగరిసరి.....ఆ.....

సంగీత సాహిత్య సమలంకృతే

సంగీత సాహిత్య సమలంకృతే

స్వరరాగ పదయోగ సమభుషితే

సంగీత సాహిత్య సమలంకృతే

స్వరరాగ పదయోగ సమభుషితే

హే భారతి మనసా స్మరామి ......హే భారతి మనసా స్మరామి

శ్రీ భారతి శిరసా నమామి .......శ్రీ భారతి శిరసా నమామి

సంగీత సాహిత్య సమలంకృతే

వేద వేదాంత వనవాసిని పూర్ణ శశిహాసిని

నాద నాదాంత పరివేశిని ఆత్మసంభాషిణి

వేద వేదాంత వనవాసిని పూర్ణ శశిహాసిని

నాద నాదాంత పరివేశిని ఆత్మసంభాషిణి

వ్యాస వాల్మీకి వాగ్ధాయిని

వ్యాస వాల్మీకి వాగ్ధాయిని జ్ఞానవల్లి సముల్లాసిని

సంగీత సాహిత్య సమలంకృతే

స్వరరాగ పదయోగ సమభుషితే

సంగీత సాహిత్య సమలంకృతే

బ్రహ్మరసనాగ్ర సంచారిణి........

బ్రహ్మరసనాగ్ర సంచారిణి భవ్య ఫలకారిని

నిత్యచైతన్య నిజరూపిణి సత్య సందీపిని

బ్రహ్మరసనాగ్ర సంచారిణి భవ్య ఫలకారిని

నిత్యచైతన్య నిజరూపిణి సత్య సందీపిని

సకల సుకళాసమున్వేషిని

సకల సుకళాసమున్వేషిని

సర్వ రసభావ సంజీవిని .......

సంగీత సాహిత్య సమలంకృతే

స్వరరాగ పదయోగ సమభుషితే

హే భారతి మనసా స్మరామి

శ్రీ భారతి శిరసా నమామి

సంగీత సాహిత్య సమలంకృతే

https://www.youtube.com/watch?v=YYN33ONkpqc






# కత్తిపోటు-కలంపోటు

పెయ్యేటి శ్రీదేవి

అమెరికా నించి, లండన్ నించి అబ్బాయి, అమ్మాయి, అల్లుడు, కోడలు, మనవలు, మనవరాళ్ళు శ్రావ్య పెళ్ళికి నెల ముందునించి వచ్చారు. శ్రావ్య శారదాంబగారి రెండో కూతురు. మొదటబ్బాయి, కోడలు, ఏడేళ్ళ పిల్లాడు రవి, నాలుగేళ్ళ కూరుతు రమ్య లండన్‌లో వుంటారు. కూతురు దివ్య, అల్లుడు, మూడేళ్ళ కొడుకు కిరణ్ అమెరికాలో వుంటారు. మూడోది శ్రావ్య. శ్రావ్యపెళ్ళికి అందరూ నెల ముందే వచ్చారు కాబట్టి పెళ్ళైపోగానే అందరూ వెళిపోతారు.

పిల్లలందరూ అమ్మమ్మ చుట్టూ చేరి కథ చెప్పమన్నారు.

కిరణ్ పరిగెత్తుకుంటూ వచ్చి గడప తగిలి పడి ఏడుపు లంకించుకున్నాడు. ఏడుస్తూ ఇలా అన్నాడు, 'ఛీ, ఇక్కడ అడ్డంగా ఈ రంగు చెక్కలెందుకు పెట్టారు? మా అమెరికాలో ఇలాంటివి వుండవు. ఫ్లోరంతా సాపుగా వుంటుంది.'

'అది చెక్క కాదురా, గడప. మీ అమెరికా వాళ్ళని చూసి ఇప్పుడు ఇక్కడా గడపల్లేకుండా ఇళ్ళు కడుతున్నారు. గడపంటే లక్ష్మీదేవి. చెక్క అనకూడదు. ఐనా నీకు నడవడం సరిగా రాక పడిపోయి, గడప అడ్డంగా వుందని ఏడుస్తావేరా వెర్రినాగన్నా. సరే, త్వరగా రండి, కథ చెబుతా.'

శారదాంబ చెప్పడం మొదలు పెట్టింది.

'అనగనగా ఒక రాజు. ఆ రాజుకి ఏడుగురు కొడుకులు.

'ఆ, ఏముందీ, ఆ ఏడుగురూ వేటకెళ్ళారు. ఏడు చేపలు తెచ్చారు. ఒకటి ఎండలేదు......'

ఇలా పిల్లలు మిగిలిన కథ చెబుతూ, 'ఇదేగా నువ్వు చేప్పేది? ఈ కథ వెబ్‌కామ్‌లో బోల్డుసార్లు చెప్పావు. చెప్పిన కథ చెప్పకుండా కొత్త కథ చెప్పు నానమ్మా' అన్నారు.

'ఐతే సీతారాముల కథ చెబుతా.'

'అది అసలొద్దు. నాకు రాములోరు, సీతమ్మగారి కథలు బాగా తెలుసు. అక్కడ గురుకులంలో చెబుతారు. పైగా 'లవకుశ', 'శ్రీరామరాజ్యం' సినిమాలు ఒక పదిసార్లన్నా చూసాం. ఇంకో కొత్త కథ చెప్పు' అన్నాడు కూతురు కొడుకు కిరణ్.

'సరే, చెబుతా వినండి.

ఒకసారి కత్తి కలం దగ్గిరకొచ్చి గొప్పగా చెప్పుకుంది, 'కలంపోటు కన్నా కత్తిపోటు గొప్పది తెలుసా? అందుకని నీకన్నా నేనే గొప్పదాన్ని.'

కలం ఏం మాట్లాడలేదు.

మళ్ళీ కత్తి కవ్వించింది, 'నీకంటే నేను గొప్ప. తెలుసా?'

కలం కాగితం మీద కత్తిబొమ్మ గీసి, దానిమీద ఒక్కపోటు పొడిచి, 'కత్తికన్న కలం గొప్ప' అని రాసి చూపించింది.

కత్తికేమీ అర్థంకాలేదు.

మళ్ళీ కలం 'శ్రీరామ' అని రాసి చదవమంది.

కత్తికి చదవడం తెలీలేదు.

అప్పుడు  కలం కాగితం మీద తిరిగి 'కత్తీ, నువ్వు నిరక్షరకుక్షివి. చదువురాని నువ్వు ఎందుకూ పనికిరాని వింతపశువ్వి. అడ్డగాడిదవి' అని రాసి చదవమంది.

కత్తి అదీ చదవలేకపోయింది.

అప్పుడు కత్తితో కలం అంది, 'చూసావా కత్తీ! నువ్వు చాలా గొప్పదాన్ననుకుని, కలంపోటు కన్న కత్తిపోటు గొప్పదని గర్వంగా విర్రవీగుతున్నావు. కాని నేను తిడుతూ వ్రాసినదాన్ని, శ్రీరామ అన్న దేవుడి నామాన్ని కూడా నువ్వు చదవలేకపోయావు. ఇప్పుడైనా కలానికి వాడి ఎక్కువ అని తెలుసుకో'

'నీకు చదువు రాదు. మంచిమాటలు చదవలేని నువ్వు మంచి అనే పదానికి అర్థం కూడా తెలుసుకోలేవు. నువ్వు తెలివితక్కువతనంతో, అహంకారం, కక్ష, కార్పణ్యాలతో, కుత్సిత కుతంత్రాలతో, అత్యాశతో నన్ను ప్రేమించమంటూ వెంటపడి వేధిస్తూ అమ్మాయిలను బాధపెట్టే కిరాతకులచేతి ఒక్క వేటుతో అమ్మాయిల  రయ్యే ఎంతోమందిని నరికేస్తున్నావే? ఇదేనా నీ కత్తిపోటు గొప్పతనం? ఎందుకొచ్చిన జన్మ! నీలాంటివాళ్ళు దేశానికి చీడపురుగులు.

వాల్మీకి, తులసీదాసు, మొల్ల, వేదవ్యాసుడు, విశ్వనాథ సత్యనారాయణ, నన్నయ, తిక్కన, పోతన-ఇలా ఎంతోమంది కవితాపితామహాత్ములు, రామాయణ, భారత, భాగవతాది మహాగ్రంథాలు కలం ద్వారానే వ్రాసారు. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఆత్రేయ, ఇంకా ఎంతోమంది మహాకవులు కలం ద్వారానే కవిత్వాలు వ్రాసి, మహాకవులయ్యారు.

పూర్వకాలంలో బంధువుల యోగక్షేమాలు, మధురమైన వాక్యాలు కలం ద్వారానే ఉత్తరాల్లో రాస్తే, పోస్టుమేన్ తెచ్చిచ్చే ఆ ఉత్తరాల పలకరింపుల్ని ఎంతో ఆనందంగా చదువుకుని, మళ్ళీ మళ్ళీ తనివిదీరా చదువుకుని, మనసునిండా సంతోషాన్ని నింపుకునే వారు. ఇప్పుడా అందమైన చేతివ్రాతలతో వ్రాసే మధురభావాలను తుడిచివేస్తూ, కలానికి ప్రత్యామ్నాయంగా ఇంటర్నెట్, సెల్‌ఫోన్ల పోటీ ఎక్కువయింది. కత్తి, ఇంటర్నెట్ లేని ఇల్లు ఉండవచ్చు. కాని కలం లేని ఇల్లు వుండరు. ఎక్కడికన్నా వెడితే కలం వెంట తీసికెళ్ళకుండా ఎవరూ వెళ్ళరు. ఒకవేళ మర్చిపోతే పక్కవాళ్ళని, 'మీ కలం ఒకసారి ఇవ్వరా?' అని అడుగుతారు. కాని 'మీ కత్తి ఒకసారి ఇవ్వరా?' అని ఎవరూ అడగరు.

ఇప్పుడు నువ్వు మనుషుల తలలు నరకడం, సినిమాల్లో, టి.వి.సీరియల్స్‌లో కనబడడమే కాకుండా, నిజంగా కూడా దుర్మార్గాలు, దోపిడీలు చేసే వాళ్ళచేతులనలంకరించి మనుషుల ప్రాణాలు తియ్యడం

గొప్పదనమనుకుంటున్నావా? ఇదేనా నీ గొప్పతనం? మనం మనుషులకుపయోగపడాలి. ఆ మనిషే మనని తయారుచేసాడు. అలాంటి మనుషుల్నే నరికేస్తావా?

ఎన్నో మంచిమాటలు, నీతికథలు రాసి అందర్నీ మంచిమార్గంలో పెట్టగలిగే శక్తి, విజ్ఞానాన్ని ఇచ్చే శక్తి, అక్షరజ్ఞానం కలిగించే శక్తి ఒక్క నాకే వుంది. అందుకని కత్తిపోటు కన్న కలంపోటే గొప్పది.

తన అపరాధమేమిటో తెలుసుకున్న కత్తికి కనువిప్పు కలిగింది. కత్తి కన్నీటితో, 'ఐతే నా ఉపయోగమేమీ లేదా? నేనెందుకూ పనికిరానా' అంది.

'ఉపయోగం ఎందుకులేదు? నీ ఉపయోగాలు నీకూ ఉన్నాయి. పూర్వం రాజుల కాలంలో నువ్వు రాజుల ఒరలలో దర్జాగా వుండేదానివి. శత్రువుల బారినుంచి తమని తాము రక్షించుకోవడం కోసం, రాజ్యాలని కాపాడడం కోసం నీ అవసరం ఎంతైనా వుండేది. ఇప్పుడు రాజ్యాలు, రాచరికాలు లేవు కాబట్టి, పరాయి దేశాలతో యుద్ధాలు వచ్చినప్పుడు, నీ స్థానాన్ని బాంబులు ఆక్రమించుకున్నాయి.

'అయితే ఇప్పుడు నా అవసరమేమీ లేదా?'

'ఎందుకులేదు? నీ అవసరం చాలా వుంది. కూరగాయలు తరగడానికి నువ్వు లేకపోతే వంట ఎల్లా తయారవుతుంది? నువ్వు కూరగాయలు తరగడానికి ఉపయోగపడు. ఇప్పుడు ఫంక్షన్స్‌లో కూడా కూరగాయలతో కూడా ఎన్నోరకాల జంతువుల బొమ్మలు, పూలగుత్తులు నీతో కోసి ఎంతో అందంగా తయారుచేస్తున్నారు. నీకుండే ఉపయోగాలు నీకున్నాయి.'

'అలాగే నేను మంచిమాటలు, విజ్ఞానాన్నందించే విషయాలు వ్రాస్తాను. అందుకనే నీకంటే నేను గొప్ప అని ఎవరికి వారు అనుకుంటూ వాదులాడుకోకుండా, గర్వం చూపించుకోకుండా మనం సమాజానికుపయోగపడే విధంగా మన కర్తవ్యాలని మనం నిర్వర్తిద్దాం. ఎవరికీ ఉపయోగపడని పనులు వృధా.'

'అదర్రా పిల్లలూ కథ. నీకంటే నేనే గొప్ప అని అవతలవాళ్ళ దగ్గర గర్వంతో గొప్పలు చెప్పుకోకూడదు అది అల్పులు చేసే పని. ఎవరి పని వాళ్ళు సక్రమంగా నిర్వర్తించాలి. ఎవరి గొప్పతనం వాళ్ళది. అందరికీ ఉపయోగపడేలా వుండాలి గాని, కత్తిలా అపకారం చెయ్యకూడదు. తెలిసిందా?'

'ఆ... తెలిసిందిగాని ఇంకో కథ చెప్పు నానమ్మా' అంటూ పిల్లలు గోల చేసారు.

'ఇంక నే చెప్పలేను బాబూ. మీకేమో చెప్పిన కథ మళ్ళీ చెప్పకూడదు. అస్తమానూ కొత్త కథ ఎక్కణ్ణించి తేను? ఇక పడుకోండి. రాత్రి పది దాటుతోంది. రేపు పెందరాళే లేవాలి. రేపు అందరం బట్టలషాపుకెడదాం. సరేనా?'

'నానమ్మా! నాకు పట్టులంగా కొను.' రమ్య అడిగింది.

'కొంటాను గాని, చక్కగా పాపిడి తీసి, జడ వేసుకుని, పూలు పెట్టుకుంటే, పట్టులంగా వేసుకున్నా బాగుంటుంది. ఇలా జుట్టు విరబోసుకుంటే బాగుండదు.'

'జడంటే ఏమిటి నానమ్మా? పాపిడంటే నాకు చాలా ఇష్టం. తియ్యగా వుంటుంది. మమ్మీ ఇండియన్ షాపులో కొంటూంటుంది. జడంటే తెలీదు.'

'ఓసి పిచ్చిమొహమా! పాపిడి అంటే తినేది కాదే. అది పాప్పిడి. ఇదుగో, నా తలలో మధ్యలో లైనుగా వుంది చూడు, ఇలా పాపిడి తీసుకుని జడ వేసుకోవాలి. జడంటే, అదుగో శార్వక్క జుట్టు పొడుగ్గా అల్లుకుందిగా? అదీ, జడంటే. ఏమిటో ఇప్పటి రోజులు! ఈ కాలం తరాలవాళ్ళకి జడంటే తెలీదు, పాపిడంటే తెలీదు. సరే, వాటిగురించి తర్వాత మాట్లాడుకుందాం. ఇంక పడుకోండి, పదయింది.'

'నాకేమో షేర్వాణీ సూటు కావాలి.'

'సరే అలాగే కొందాం. పడుకోండి.'

'ఐతే ఒక పాట పాడు, పడుకుంటాం.'

'నగుమోమూ గనలేని నా జాలి తెలిసీ.....' అంటూ త్యాగరాజ కీర్తన పాడింది శారదాంబ.

పాట వింటూ పిల్లలు నిద్రలోకి జారుకున్నారు.

❖❖❖❖❖



❖❖❖❖❖



**బాలవాహిని**

# ద్విత్వాల (ఒత్తుల) పాట

*dwitvAla (ottula) pATa*

| | | |
|---|---|---|
| అక్కకు | చుక్కకు | క ఒత్తు |
| *akkaku* | *chukkaku* | *ka ottu* |
| మొగ్గకు | బుగ్గకు | గ ఒత్తు |
| *moggaku* | *buggaku* | *ga ottu* |
| మచ్చకు | పచ్చకు | చ ఒత్తు |
| *machchaku* | *pachchaku* | *cha ottu* |
| బొజ్జకు | సజ్జకు | జ ఒత్తు |
| *bojjaku* | *sajjaku* | *ja ottu* |
| తట్టకు | బుట్టకు | ట ఒత్తు |
| *taTTaku* | *buTTaku* | *Ta ottu* |
| బిడ్డకు | చెడ్డకు | డ ఒత్తు |
| *biDDaku* | *cheDDaku* | *Da ottu* |
| అత్తకు | నత్తకు | త ఒత్తు |
| *attaku* | *nattaku* | *ta ottu* |
| ఎద్దుకు | మొద్దుకు | ద ఒత్తు |
| *edduku* | *modduku* | *da ottu* |

# ద్విత్వాల (ఒత్తుల) పాట..2


*dwitvAla (ottula) pATa*

| | | |
|---|---|---|
| నాన్నకు | అన్నకు | న ఒత్తు |
| *nAnnaku* | *annaku* | *na ottu* |
| అప్పుకు | సొప్పుకు | ప ఒత్తు |
| *appuku* | *soppuku* | *pa ottu* |
| మబ్బుకు | జబ్బుకు | బ ఒత్తు |
| *mabbuku* | *jabbuku* | *ba ottu* |
| అమ్మకు | బొమ్మకు | మ ఒత్తు |
| *ammaku* | *bommaku* | *ma ottu* |
| అయ్యకు | కొయ్యకు | య ఒత్తు |
| *ayyaku* | *koyyaku* | *ya ottu* |
| కర్రకు | బుర్రకు | ర ఒత్తు |
| *karraku* | *burraku* | *ra ottu* |
| మల్లెకు | పల్లెకు | ల ఒత్తు |
| *malleku* | *palleku* | *la ottu* |
| కళ్ళకు | ముళ్ళకు | ళ ఒత్తు |

# ద్విత్వాల (ఒత్తుల) పాట..3

*dwitvAla (ottula) pATa*

| | | |
|---|---|---|
| *kaLLaku* | *muLLaku* | *La ottu* |
| అవ్వకు | బువ్వకు | వ ఒత్తు |
| *avvaku* | *buvvaku* | *va ottu* |
| కస్సుకు | బుస్సుకు | స ఒత్తు |
| *kassuku* | *bussuku* | *sa ottu* |
| అహ్హకు | ఉహ్హకు | హ ఒత్తు |
| *ahhaku* | *uhhaku* | *ha ottu* |
| బఱ్ఱెకు | గొఱ్ఱెకు | ఱ ఒత్తు |
| *baRReku* | *goRReku* | *Ra ottu* |


SMG Stone
SMG Stone pty ltd.
Web: http://www.smgstone.com.au
Phone : +61 2 9708 5566
Mobile : +61 418 696 672
Email: info@smgstone.com.au
STONE WITH LIFE
FOR STYLE AND ELEGANCE
FOR INDOORS AND OUTDOORS
Welcome to SMG Stone Pty Ltd . SMG Stone, based in Sydney, is committed to bring the nature to your homes from around the world. Established in 1992, SMG gained expertise in selecting, procuring and supplying natural stone from around the world. SMG has a huge selection of surfacing options for paving, building facades, lobbies, vanities, staircases and landscaping features. We are direct importers and wholesale distributors of quality natural stones such as granite, marble, slate, sandstones, cobble and the engineered stones in slab form for use in the manufacture of kitchen and vanity bench tops as well as other building uses.
Based in Sydney Australia with warehouses in Sydney and Melbourne, we are one of the reputed suppliers of an exclusive range of world class marble stone, granite and other natural stones. We import natural stone from around the world.
At SMG Stone Pty Ltd (SMG) we have the finest and largest product range. Our Sydney warehouse contain over 50,000sqm of natural stone. We have streamlined the supply chain for your convenience. We aim to achieve 100% client satisfaction by delivering a beautiful product with the highest quality and most importantly, with the right price. As project suppliers, we are able to procure natural stone according to your own specifications.
Specialized in the supply of natural stone products for hospitality, multi-family residential dwellings and institutional projects.
BRING NATURE TO HOMES
Designed by: DSLRCREW


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145

❖❖❖❖❖


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au


BIRYANI HOUSE
PARADISE
Biryani House
BIRYANI HOUSE
14 George Street North Strathfield
Open 7 Days for Lunch and Dinner
Call us : 0297635282

❖❖❖❖❖




08:00 - 10:00 AM Sydney Time on Sat
02:30 - 04:30 AM India time
16:00 - 18:00 Hrs New York Time (Day -1 or Fri)
[ For India/US +1 Hour during Australia Winter Time]

Listen to Radio on 2TripleO FM 98.5 or DAB 985 or

You can also listen on PC/ internet, the URL is:
https://2tripleo.com.au/en-au/
http://s7.viastreaming.net/8500/m/

The program can also be listened over phone-audio by dialling: **+61 2 8080 5650**

via **TuneIn** App on **Android | iPhone**

**తెలుగువాణి – ఆస్ట్రేలియా స్వరవాహిని**
**2TripleO FM98.5 MHz**
**DAB 985**
**Saturdays 08:00 – 10:00AM Sydney Time**

27 సంవత్సరాలుగా సిడ్నీ తెలుగువారిని ప్రతి శనివారం ఉదయం 08:00 - 10:00 గంటల వరకు, మంచి మంచి అంశాలతో అలరిస్తూ, 25 ప్రసారకుల స్వచ్ఛంధ సేవలతో రేడియో కార్యక్రమాలను అందిస్తున్న తెలుగువాణి కార్యక్రమాలను
2TripleO FM 98.5 అలవరసాలపై
**వినండి. వినిపించండి. వింటూ ఉండండి.**
ప్రసారకులుగా కార్యక్రమాలు అందించాలనే ఆసక్తి ఉన్నవారు;
కారక్రమాలకు ఆర్ధికంగా ప్రోత్సాహం అందించ తలచుకున్నవారు;
వ్యాపార ప్రకటనలను ఇవ్వదలచుకొన్నవారు;
మా కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలియచేయాలనుకొనేవారు – సంప్రదించండి:

శ్రీ సారధి మోటమర్రి, 0430 022 130 or vani@sydneytelugu.org

**https://www.facebook.com/TeluguVaniSydney**


❖❖❖❖❖






❖❖❖❖❖


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au

తెలుగు బడి

TeluguBadi

# తెలుగు బడికి ఆహ్వానం

## Welcome to Telugu Language School

**We provide:**

- Caring teachers
- Personal attention
- Attractive learning activities
- Outcomes based teaching

**A great opportunity for your child to learn Telugu.**

Enrol in your nearest school today for 2020 starting on Sun, 2-Feb-2020.

**Our Schools:**

- Strathfield South PS
- Hambledon PS (Quakers Hill)
- Darcy Rd PS (Wentworthville)
- Eastwood PS
- Beaumont Hills PS (Kellyville)

**When:** Every Sunday from 10 am to 12 noon (during school terms)

For details,
Visit: www.sydneytelugu.org
Call: 0402 169 963
Email: school@sydneytelugu.org

# అమెరిపబ్లికన్ ఏనుగూ – డెమొక్రాట్ గాడిదా

శ్రీ వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్, USA

(ఈ కథ 2016 లో అమెరికాలో ఎన్నికల సందర్భం గా వ్రాసినది అయినా, చాలా విషయాలలో పెద్ద మార్పులు లేవు.)

ఈ మధ్యన నాకు అమెరికా టీవీ చూసినప్పుడల్లా ఇండియా వాళ్ళ మీద భలే కోపం వస్తోంది. ఎందుకంటే అమెరికా నల్ల వాళ్ళ సహజ సిద్ధమైన నడకనీ, స్టెప్పులనీ మన సినిమా హీరోలు పేలవంగా అనుకరించి "గొప్ప పెర్ఫార్మెన్స్" అనో "సూపర్" అనో అనేసుకుని మెగా, పవర్, మెగా పవర్, ఆంధ్రా మైకెల్ జాక్సన్, తెలంగాణా జెన్నిఫర్ లోపెజ్ అనీ బిరుదులు ఇచ్చేసుకుంటారు కదా. అలాగే ఎవరూ చూడకుండా ఇంట్లో ఉన్నప్పుడు ఇడ్లీలు, దోశలూ లాగించేసినా ఊళ్ళోకి వెళ్ళినప్పుడు లోకువ అయిపోకుండా కిళ్ళీ కొట్లో కూడా క్యుకుంబర్ సాండ్ విచ్, పిచ్చి పిచ్చి పిజ్జాలు, వెర్రి వెర్రి బర్గర్లు నోట్లో కుక్కేసుకుని అమెరికన్ ఫీలింగ్ తో మైమరిచిపోతారు కదా. అలాంటిది మన రాజకీయం గాళ్ళు పార్టీ గుర్తులు పెట్టుకున్నప్పుడు అమెరికా వాళ్ళ లాగా సరిగ్గా వాళ్ల వ్యక్తిత్వాలకి అతికేటట్టు ఎందుకు పెట్టుకోరూ అనేదే నా ఆక్రోశానికి కారణం. ఎంతో పేలవంగా ఏ నాయకుడూ చచ్చినా తొక్క లేని సైకిలు, సొంతంగా నడప లేని కారు, కరెంట్ లేక తిరగని పంకా, సువాసన లేని కమలం, ఈ రోజుల్లో ఎవడూ వాడని కొడవలి, కనపడిన వాళ్ళ నెత్తిన పెట్టడానికి రెడీగా ఉన్న భస్మాసుర హస్తం ఇలా ఎక్కడా వాళ్ళు చేసే రాజకీయాలకీ వాళ్ళు వాడే గుర్తులకీ ఏమీ సంబంధం ఉండదు. రంగు రంగుల కండువాల భాగోతం కూడా ఉన్నా, ఎన్నికలకి ఇలాంటి అస్తవ్యస్తపు గుర్తులు పెట్టుకుంటే జనాలకి గుర్తు పెట్టుకోవడం కష్టం కదా. అదే మా అమెరికాలో అయితే హాయిగా ఒక పార్టీ గుర్తు గాడిద. మరో పార్టీ గుర్తు ఏనుగు. ఈ గుర్తులు గుర్తుపెట్టుకోడానికి అస్సలు కష్టపడక్కర లేదు. మరో పది పార్టీలు కూడా ఉన్నాయి కానీ ఆ పార్టీలే ఎవరికీ గుర్తు లేనప్పుడు ఏ గుర్తు అయితేనేం. అప్పటి కీ వాళ్ళ లో కొందరు కూడా రాబందు, పిల్లి లాంటి గుర్తులే వాడతారు.

"అయితే ఏమంటావ్? ఇండియాలో రాజకీయ పార్టీ వాళ్ళు ఇందులో కూడా అమెరికా వాళ్ళని కాపీ కొడుతూ పార్టీ గుర్తులు మార్చుకోవాలంటావా? నీ బోడి సలహా వాళ్లకి అక్కర లేదు" అని కొప్పడింది మా క్వీన్ విక్టోరియా. ఆవిడ అలా కొప్పడిందీ అంటే అది ఖచ్చితంగా ఆడువారి మాటలకూ అర్థాలే వేరులే అని అర్థం కదా! పైగా పరిష్కారం గురించి మాట్లాడకుండా సమస్యని వాళ్ళే కనిపెట్టేసినట్టు ఎత్తి చూపించేసి కాలర్ ఎత్తుకోడానికీ, తమ అభిమాన సాహితీ విమర్శకుల చేత పొగిడించుకోడానికీ నేనేమన్నా "సామాజిక స్పృహ, ఉన్నత ప్రమాణాలతో ప్రపంచాన్ని ఉద్ధరించేస్తున్న" లాంటి గొప్ప రచయితనా? అంచేత నా "బోడి" సలహాలు ఉచితంగానే ఇస్తాను.

నేను అనేది ఏమిటంటే ...ఆ మాట కొస్తే అందరూ కూడా రాజకీయ నాయకుల నుంచి ఆశించేది "చెప్పినది చేసి చూపించాలి" అని కదా!. అలాంటప్పుడు దాన్నే ప్రతిబింబించే పేరే పార్టీలకి ఎన్నికల గుర్తుగా పెట్టుకుంటే సరిగ్గా అతికి, నిశానీలు కూడా ఓటు వెయ్యడానికి వీజీగా ఉంటుంది కదా! ఉదాహరణకి నేను ఎప్పుడు ఏ తెలుగు టీవీలో వార్తా విశ్లేషణ కార్యక్రమాలు చూసినా అక్కడ విశ్లేషణ తక్కువా, భౌ భౌ అనుకుంటూ పరస్పర దూషణ ఎక్కువా వినపడుతూ ఉంటాయి. దాన్నే "మా మీద బురద జల్లుతున్నారు అని ఒక పార్టీ వారు మరొక పార్టీ వారితో అందరికీ అర్థం అయ్యేలా వారి దినచర్య వారే చెప్పుకుంటారు. అలా చుట్టూ బురద జల్లుకుంటూ మహాదానందపడిపోయే ఏకైక దైవ సృష్టి ఆది వరాహావతారమే కదా. అంచేత ఒక పార్టీ వారు సింపుల్ గా "పంది" పార్టీ గుర్తుకే ఓటు వెయ్యండీ అనీ..దానికి జవాబుగా ఆ రెండో పార్టీ వారు "ముళ్ళ పంది" పార్టీ యే మా గుర్తు అనీ ప్రచారం చేసుకోవచ్చును. "పందుల పార్టీ, సందు సందులో మందుల పార్టీ, బురద అంటని

మాదే మందుల పార్టీ ” అని ప్రచార గేయ రచయితలూ, గాయనీ గాయకులూ రెచ్చిపోక పోతే పంది మీద పందెం. అమెరికాలో “గాడిద” గుర్తుగా పెద్ద రిపబ్లికన్ పార్టీయే ఉండగా ఆంధ్రాలో ఆ మాత్రం ఉండకూడదా!

అన్నట్టు మన పవిత్ర భారత దేశంలో అన్ని వృత్తులలోనూ మహిళలు ‘రాణి’స్తున్నారు కానీ ఎందుకో ఈ రాజకీయ విశ్లేషకుల డిపార్ట్ మెంట్ లో అస్సలు కనపడరు ఎందుకో. దీని వెనకాల ఏదైనా కుట్ర దాగి ఉందా అని “మహిళా కుతంత్ర కమిషన్” వేస్తేనే కాని తెలియదు. అమెరికాలో అలా కాదు. ఏ చానెల్ తీసుకున్నా మహిళలు ఈ “టాకింగ్ హెడ్స్ లో” భారీ సంఖ్యలోనే ఉంటారు.

ఇక మనకి అమెరికాలో లేని మరో కల్చర్ ఉంది. అదే విగ్రహారాధన. నేను చెప్పే మరో ఉచిత సలహా ఏమిటంటే...ఇప్పటి లాగా ప్రతీ పేట లోనూ గతించిన నాయకుల విగ్రహాలు కాకుండా ఆయా పార్టీ గుర్తులు మాత్రమే విగ్రహాలుగా పెట్టి పండగలకీ, పబ్బాలకే దండ వేసి పూజించాలి. ఓ పేటలో వరాహ విగ్రహం, మరో జంక్షన్ లో గాడిద, ఇంకో చోట కుక్కా ఇలా సకల జంతువుల విగ్రహాలకీ దండలు వేసి ఉంటే అమెరికా అధ్యక్షుడు కానీ, రష్యా ప్రధాని కానీ వచ్చినప్పుడు మన పవిత్ర భారతీయులకి జన్యుప్రాణులూ, పర్యావరణాల మీద ఉన్న ఆసక్తికి, ఆరాధనకీ అబ్బురం పడి ఇంకా ఎక్కువ పెట్టుబడులు పెట్టి ఆ లాభాలు పట్టుకుపోతారు. అలా కాక ఇప్పటి గుర్తులైన సైకిలూ, కారూ, పంకాల విగ్రహాలు పెడితే మనకేదో పిచ్చి అనుకునే ప్రమాదం ఉంది.

అసలు ఈ ఒరిజినల్ ఆలోచనలు ఎందుకు వచ్చాయీ అంటే ప్రస్తుతం అమెరికాలో ఈ ఏడాది ఆఖర్న జరగబోయే అధ్యక్షుల ఎన్నిక జోరు లో నేను రిపబ్లికన్ & డెమోక్రటిక్ పార్టీ అభ్యర్ధుల ప్రవచనాలు, డిబేట్లు అన్నీ చూస్తున్నాను. అవి చూసినప్పుడల్లా అప్పుడప్పుడు అమెరికా మనవాళ్ళ దగ్గర నుంచి “బురద జల్లడం” లో శిక్షణ పొందితే ఇంకా బావుండును కదా అనిపిస్తుంది. మరో సారి వీళ్ళు కూడా ఏదో సూటూ, బూటూ వేసుకుని దర్జాగా ఉండడంలో తప్ప అర్థం పర్థం లేకుండా మాట్లాడడంలో మనవాళ్ళకి ఏం తీసిపోరు సుమా అనిపిస్తుంది.

ఉదాహరణకి డొనల్డ్ ట్రంప్ అనే ఆయన “నేనే కనక అమెరికా అధ్యక్షుడిని అయితే కొన్నాళ్ళ పాటు ముసల్మానులని ఈ దేశంలోకి అడుగుపెట్టనివ్వను” అనీ, “అమెరికా చుట్టూ పెద్ద గోడ కట్టేసి ఆ బిల్లు మెక్సికన్ వాడిచేత కట్టిస్తాను” అనీ అంటూ ఉంటే “ఎవడీ అడ్డ గాడిదా?” అనుకున్నాను...ఎందుకంటే ఆయన “గాడిద” పార్టీ కేండిడేటు. ఇంకా నయం ఈ మహానుభావుడు నలభై ఏళ్ల క్రితమే ఆ గోడ కట్టేసి ఉంటే నేను అది దూక లేక ఇండియా లోనే ఉండిపోవలసి వచ్చేది....ఇండియా వాళ్ళు ఎంత అదృష్టవంతులో కదా” కూడా అనిపించింది. అలాగే హిలరీ క్లింటన్ అనే ఆవిడ “నా హయాంలో ఉగ్రవాదుల వెనకాల పడి తరిమేస్తాను” అంటుంది. అరేబియా గుర్రాల్లా పరిగెడుతున్న ఆ ఐసిస్ ఉగ్రవాదుల్ని చిన్న గున్న ఏనుగులా ఉన్న ఈవిడ ఏం తరిమికొడుతుందీ, నా తలకాయ” అనుకున్నాను అది విని. ఆవిడది “ఏనుగు” పార్టీ.

అమెరికాలోనే అగ్ర నాయకులు ఆయా పార్టీ గుర్తులని ప్రతిబింబిస్తూ మాట్లాడుతుంటే ఇండియా నాయకులు ఏమన్నా తీసిపోయారా? దమ్ములుంటే ఒక సారి కేసీఆర్ కీ, చంద్ర బాబు నాయుడికీ, వై యస్. జగన్ కీ ఒకే వేదిక మీద అమెరికా వాళ్ళ పద్దతిలో ఒక డిబేట్ పెట్టి చూడండి. టాపిక్ ఏదైనా పరవా లేదు. టీవీ రేటింగులు ఆకాశానికి ఎదిగిపోక పోతే నా మీద ఒట్టే. ఆ డిబేట్లు చూడడానికి అమెరికా నుంచి కూడా కులాల వారీగా, ప్రాంతాల వారీగా సూట్లూ, బూట్లూ వేసుకుని ఎన్నారై జనం దిగుమతి అయిపోతారు. ఎందుకంటే ఈ మధ్యనే మన ప్రభుత్వాలు మనోళ్ళనే అమెరికాలో జన సమీకరణకి ప్రభుత్వ ప్రతినిధులుగా నియమించడం మొదలు పెట్టారు. వాళ్ళ ప్రధాన కర్తవ్యం ఇలాంటి సమీకరణలే కదా!

అసలు అమెరికాలో ఎన్నికల సమయంలో పెద్ద పెద్ద కంపెనీల వాళ్ళు, ఐశ్వర్యవంతులు, లాబీ వర్గాల వారు ఎన్నికలలో నుంచున్న వాళ్లకి డబ్బిచ్చి, వాళ్ళు సెనేటర్ గానో, కాంగ్రెస్మన్ గానో నెగ్గాక కావలసిన పనులు

చేయించుకుంటారు. వోటర్లకి పైసా కూడా దక్కదు. కానీ ఇండియాలో ఎన్నికలలో నుంచున్న వాళ్ళే అందరికీ డబ్బిచ్చి, ఎమ్మెల్యేగా నెగ్గాక అప్పుడు సారా కొట్లు, ఇసక వ్యాపారాలూ, అమరావతిలో భూమి కొనుగోళ్ళు సునాయాసంగా చేసుకుంటారు. అంచేత ఇండియా డిబేట్లలో తిట్టుకోడానికి చాలా ఆసక్తికరమైన అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం అమెరికాలో తమ పార్టీ తరఫున ప్రెసిడెంట్ పదవికి ఎవరు పోటీ చెయ్యాలీ అని  గాడిదలు, ఏనుగులూ వాటిలో అవే డిబేట్లు జరుపుకుంటున్నాయి. అది తేలాక అప్పుడు గాడిదా, ఏనుగూ తలపడతాయి. మన దేశంలో కూడా వారి వారి వాగుడుని బట్టి పార్టీ గుర్తులని మార్చుకుంటే నిజాయితీగా ఉంటుంది అని నా "బోడి" సలహా. గాడిద, పంది, కోతి, కుక్క, పిల్లి, ఎలక, చుంచు, కాకి----ఇలా కాదేదీ పార్టీ గుర్తులకి అనర్హం. అప్పుడు ఇండియాలో ఈ డిబేట్లు పెడితే భలే సరదాగా ఉంటుంది కదా!  వాళ్ళు నుంచునే  పోడియం వెనకాల తెర మీద ఆయా జంతువుల బొమ్మలు కూడా పెడితే మరీ బావుంటుంది.

ఈ సోదంతా చదివి మా క్వీన్ విక్టోరియా పక పకా నవ్వేసి.. "గొప్పగా రాసేశాను అనుకుంటున్నావేమో మొగుడూ....నీకు గాడిద పార్టీకీ, ఏనుగు పార్టీకి తేడా తెలీదు. అసలు ఏ పార్టీ గుర్తు ఏదో సరిగ్గా తెలీకండా రాసి పారేశావు. అందుకే నీ సలహా ఎప్పుడూ బోడి సలహాయే" అని మామూలు కంటే ఘాటిగా టెంకి జెల్ల కొట్టేసి అర్ధరాత్రి వర్క్ కి పారిపోయింది. చెప్పొద్దూ, అప్పుడు అర్థం అయింది....ట్రంప్ గారి రిపబ్లికన్ పార్టీ గుర్తు గాడిద కాదు ఏనుగు సుమా అనీ, అలాగే నేను ఏనుగు అనుకున్న హిలరీ గారు నిజానికి గాడిద పార్టీకి చెందిన ఆవిడ అనీ. కానీ, నేను చేసింది పొరపాటే అయినా  ...కానీ ఏ రాయి అయితేనేం పళ్ళు రాలగొట్టుకోడానికీ, ఎవరు నెగ్గినా మనకి ఒరిగేది ఏమీ లేదు కదా అని కూడా అనిపించింది.  ఇది అక్కడా, ఇక్కడా ఒకటే. రాజకీయవాదులలో చాలా మంది వాటికున్న కనీస సహజ గుణాలు కూడా లేని ఒక రకమైన జంతువులే!

❖❖❖❖❖



❖❖❖❖❖




తెలుగు అసోసియేషన్ సిడ్నీ

